జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 17 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 132 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: పాడ్యమి - 11:53:40 వరకు నక్షత్రంపుష్యమి - 21:47:53 వరకు కరణంబవ - 11:53:40 వరకు, బాలవ - 22:21:00 వరకు పక్షంశుక్ల యోగంహర్షణ - 08:04:35 వరకు, వజ్ర - 28:30:30 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

**నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం

## ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

**అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం**

**రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు**

న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు భారీ ఎత్తున రాజీనామాలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు అంతరిక్ష విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ కీలక నిర్ణయం

మిగతా 2లో..

# 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

## ఎంపిలకు కొత్త మార్గదర్శకాలు జారీ

- మళ్లీ తెరపైకి డీలిమిటేషన్ బిల్లులు!
- గట్టెక్కించేందుకు మోదీ సర్కార్ పావులు
- నాడు ఆమోదం పొందలేకపోయిన బిల్లు
- సంఖ్యా బలం సరిపోక ఆమోదానికి దూరం
- ఎంపీల హాజరుపై కేంద్రం తీవ్ర కసరత్తు
- ఎన్డీయేకు తృణమూల్‌లో చీలిక అస్త్రం



**పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మళ్లీ రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో సంఖ్యా బలం చాలక ఆమోదానికి నోచుకోని రాజ్యాంగ సవరణ బిల్లులను జులై 20 నుంచి జరిగే వర్షాకాల సమావేశాల్లో గట్టెక్కించేందుకు మోదీ సర్కార్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.**

న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): ఈ నెల 20 నుంచి ఆగస్టు 17 వరకు అత్యంత ప్రాధాన్యంతో జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీల కోసం సరికొత్త మార్గదర్శకాల ను జారీ చేస్తూ అధికారిక బులిటెన్ విడుదల చేసింది. ముఖ్యంగా సభలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత గోప్యతను కాపాడటంతో పాటు పార్లమెంటు అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై సచివాలయం పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది. సభా రికార్డులకు భిన్నంగా రహస్యంగా చిత్రాలు తీయడం, వీడియోలు రికార్డ్ చేయడం వంటి అనధికారిక చర్యలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతా ప్రమాణాల దృష్ట్యా సభలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నూతన ఆదేశాల ప్రకారం.. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి ఎలాంటి నిఘా ఆధారిత గ్యా÷-జడెట్లనూ అనుమతించరు. కేవలం సాంకేతిక ఆంక్షలకే పరిమితం కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రజాస్వామ్య యుతమైన గౌరవాన్ని కాపాడేందుకు మరికొన్ని కఠిన నిబంధనలనూ ఈ బులిటెన్‌లో చేర్చారు. పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు చేపట్టడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే సభా సమయాన్ని, వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం వంటి చర్యలను పూర్తిగా నిరాకరించారు.

మిగతా 2లో..

## సభలో అయోధ్య విషయంపై నిలదీస్తాం

- అయోధ్య విరాళాల చోరీని ఎండగడతాం
- డీలిమిటేషన్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తాం
- పార్లమెంట్ సమావేశాలపై కాంగ్రెస్ కసరత్తు
- సోనియా గాంధీ నివాసంలో ముఖ్య నేతల భేటీ
- సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ

న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం, విద్యా వ్యవస్థలో నెలకొన్న వ్యవస్థాగత క్షీణత వంటి కీలక అంశాలపై

## ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం

**ఇరాన్, అమెరికా పరస్పర దాడులు**

**ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులు**

**ప్రతిగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు**



న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి వైమానిక దాడులు నిర్వహించగా, ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్‌లను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగింది. ఇదిలా ఉండగా దిగ్బంధనంలో భాగంగా ఇరాన్ వైపు ప్రయాణిస్తున్న ఓ ఖాళీ చమురు ట్యాంకర్‌ను అమెరికా బలగాలు నిర్వీర్యం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది.

మిగతా 2లో..

## నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం

**5 లక్షలకు 111 ప్రశ్నలు విక్రయం**

**సిబిఐ నివేదికలో వెలుగులోకి కీలక విషయాలు**





న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రాల సెట్లలోని 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించాయని సీబీఐ తెలిపింది. ఈ మేరకు కేసు దర్యాప్తు వివరాలను ప్రత్యేక కోర్టుకు వెల్లడించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు

మిగతా 12లో..



# 500 మంది జలసమాధి

- బంగాళాఖాతంలో ఘోర ప్రమాదం
- రోహ్యింగ శరణార్థుల పడవలు బోల్తా
- ఘటనలో 500 మంది దుర్మరణం
- ఐక్యరాజ్యసమితి అధికారిక ప్రకటన



న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): బంగళాఖాతంలో ఘోర ప్రమాదం సంభవించింది. రెండు పడవల్లో మయన్మార్ నుంచి బయలుదేరిన 500 మంది సముద్రంలో జల సమాధి అయ్యారు. ఈ ఘటన గురించి తాజాగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. వీరంతా బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలకు వెళుతుండగా.. ప్రమాదం చోటుచేసుకుంది. బాధితులకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని ఐరాస వెల్లడించింది. మయన్మార్‌లో తీవ్ర హింసను ఎదుర్కొంటోన్న రోహింగ్యాలు.. తమ ప్రాణాలను కాపాడుకోడానికి పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలకు అత్యంత ప్రమాదకరంగా సముద్ర మార్గంలో వెళ్తున్నారు. మయన్మార్ తీరంలోని బంగాళాఖాతంలో రోహింగ్యా శరణార్థులతో వెళ్తున్న రెండు పడవలు బోల్తా పడి 500 మందికి పైగా మరణించినట్లు

మిగతా 12లో..

## సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

**రెండో తరగతి విద్యార్థికి మతపరమైన హోం వర్క్**

హైదరాబాద్,జూలై16(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 'కల్మా',

మిగతా 2లో..

## రీఫండబుల్ బాండ్ చెల్లించాల్సిందే

- 100,000 అమెరికన్ డాలర్ల కట్టాల్సిందే
- భారతీయుల నెత్తిన మరో పిడుగు!!
- అమెరికాలో గ్రీన్ కార్డ్ పై కొత్త ఆంక్షలు




న్యూఢిల్లీ,జూలై16(ప్రజాజ్యోతి): అమెరికాలో శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) పొందాలనుకునే విదేశీయులకు మరో కీలక మార్పు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలన పరిశీలిస్తున్న కొత్త ప్రతిపాదన ప్రకారం, అమెరికా వెలుపల నుంచి గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకునే కొందరు అభ్యర్థులు గరిష్ఠంగా 1 లక్ష అమెరికన్ డాలర్లు వరకు రీఫండబుల్ బాండ్ (తిరిగి చెల్లించే డిపాజిట్) జమ చేయాల్సి రావచ్చని ది వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక వెల్లడించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే, ఇప్పటికే క్లిష్టంగా, సుదీర్ఘంగా ఉన్న అమెరికా ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో మరో ఆర్థిక అడ్డంకి చేరినట్లవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా విదేశాంగ శాఖ పరిశీలిస్తున్న పైలట్ ప్రోగ్రామ్ ప్రకారం, అమెరికా కాన్సులేట్‌ల ద్వారా విదేశాల

మిగతా 2లో..






## గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

- నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం
- ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కేసీఆర్ డబ్బులు వృథా
- సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు
- ఖజనాపై భారం మోపారన్న డిప్యూటీ సీఎం భట్టి

భద్రాద్రి కొత్తగూడెం,జూలై16(ప్రజాజ్యోతి): గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల

మిగతా 12లో..

# సంపాదకీయం

## దేశంలో డీ లిమిటేషన్ రాజకీయాలు !

మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయని చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతుకు సంబంధించిన వ్యవహారం సాగిందని అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీపీ ఎంపీల మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే పాత్ర అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది...ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది... అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే బయటకు వచ్చింది.దీంతో డీఎంకే కూడా కొంత మెత్తబడి ఎన్డీఏకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చింది. దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుత పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

# 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు



మొదటిపేజీ తరువాయి..

వీటితో పాటు పార్లమెంటు పరిధిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేదా పూజలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ, సభా మర్యాదలను, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంపీలందరూ సహకరించాలని లోక్‌సభ సచివాలయం ఈ విస్తృతమైన మార్గదర్శకాల ద్వారా కోరింది. మరోవైపు పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మళ్లీ రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో సంఖ్యా బలం చాలక ఆమోదానికి నోచుకోని రాజ్యాంగ సవరణ బిల్లులను జులై 20 నుంచి జరిగే వర్షాకాల సమావేశాల్లో గట్టెక్కించేందుకు మోదీ సర్కార్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ల బిల్లులను మళ్లీ తెరపైకి తెచ్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 20నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఒకే దేశం, ఒకే ఎన్నికల ప్రతిపాదన కింద నియోజకవర్గాల పునర్విభజనకు చట్ట సవరణ బిల్లును ఎన్డీయే సర్కార్ మళ్లీ తెరపైకి తెస్తుందని సమాచారం. మహిళా రిజర్వేషన్లతో ముడిపెట్టి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు అధికార కూటమి సంఖ్యా బలం సరిపోక ఆమోదం పొందలేకపోయింది. సాధారణ చట్టాల మాదిరిగా రాజ్యాంగ సవరణ బిల్లులను సాధారణ మెజారిటీతో ఆమోదించడం సాధ్యంకాదు. వీటికి ప్రత్యేక మెజారిటీ అవసరం. అందుకే ప్రతి ఎంపీ, ప్రతి ఖాళీ స్థానం, మారుతున్న ప్రతి రాజకీయ సమీకరణం చాలా కీలకం. రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులోని ఉభయ సభలలోనూ రెండు అడ్డంకులను అధిగమించాలి. బిల్లు ఆమోదానికి సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో సగానికిపైగా మద్దతు ఉండాలి. అలాగే ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యులలో కనీసం మూడింట రెండు వంతుల మంది మద్దతు ఇవ్వాలి. కచ్చితంగా ఇదే విషయంలో ఏప్రిల్ నెలలో బిల్లు ఆమోదింపచేయడంలో ఎన్డీయే సర్కార్ విఫలమైంది. ఏప్రిల్‌లో నియోజకవర్గాల పునర్విభజన, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల స్థానాల పెంపు తద్వారా మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తెచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. అనుకూలంగా ఎక్కువ ఓట్లు వచ్చిన బిల్లు ఆమోదానికి మరో 54 ఓట్లు తక్కువయ్యాయి. మొత్తం 528 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనగా మూడింట రెండు వంతుల మార్కు 352గా ఉంది. ఫలితంగా ఆ బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. దేశ రాజకీయాల్లో వచ్చిన అనూహ్య మార్పులతో మూడు నెలల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సమాయత్తమవుతోందని సమాచారం. గత మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగకపోయినప్పటికీ పార్టీ ఫిరాయింపులు, చీలికలు, మారుతున్న కూటములు, పార్లమెంటులో ఖాళీలతో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ఈ పరిణామాలు ఎన్డీయేను బలోపేతం చేయగా, ప్రతిపక్షాల బలాన్ని క్రమంగా తగ్గించాయి.తృణమూల్ కాంగ్రెస్‌లో చీలిక ఎన్డీయేకు కలిసి వచ్చింది. టీఎంసీకి చెందిన 20 మంది అసమ్మతి ఎంపీలు పార్టీ నుంచి విడిపోయి 'నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియా చీణా×లో విలీనమైనట్లు తెలిపారు. చీణాకు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశాలకు ముందే స్పీకర్ అధికారికంగా ఈ విలీనాన్ని గుర్తిస్తే లోక్‌సభలో అధికార కూటమి బలానికి భారీ ఊతం లభిస్తుంది. ఉద్ధవ్ ఠాక్రే శివసేన వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన ఏకనాథ్ శిందే శివసేనలో చేరారు. ఈ ఎంపీలకు గుర్తింపు లభిస్తే వారు ప్రతిపక్ష బెంచీల నుంచి అధికార కూటమి వైపు మారుతారు. ఇక టీవీకేకు కాంగ్రెస్ మద్దతివ్వడంతో దశాబ్దానికిపైగా కొనసాగిన కాంగ్రెస్- డీఎంకే కూటమి విచ్ఛిన్నమైంది. డీఎంకే అధికారికంగా ఎన్డీయేలో చేరనప్పటికీ ఇండి కూటమి నుంచి అది నిష్క్రమించడం అంటే ప్రతిపక్షాలు ఇకపై ఆ పార్టీకి చెందిన 22 మంది లోక్‌సభ ఎంపీల మద్దతును పూర్తిగా నమ్ముకునే పరిస్థితిలేదు. కొన్ని ఎంపిక చేసిన చట్టాలపై డీఎంకే నుంచి అంశాల వారీగా మద్దతు పొందాలని బీజేపీ భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికలు వివిధ రాష్ట్రాల్లో పార్టీల బలాబలాల్లో వచ్చిన మార్పుల ద్వారా ఎగువ సభలో కూడా ఎన్డీయే తన పట్టును పెంచుకుంది. లోక్‌సభ సీట్లు 543 అయినప్పటికీ ఎంపీల మరణాల వల్ల 3 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాబట్టి సభలో అసలు సంఖ్య తగ్గింది. దీనివల్ల మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడానికి అవసరమైన సంఖ్య కూడా తగ్గుతుంది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి ఎంపీల హాజరు కూడా చాలా ముఖ్యం. ఓటింగ్ సమయంలో ఎంపీలు గైర్హాజరైనా, వాకౌట్ చేసినా, సభకు దూరంగా ఉన్నా మెజారిటీ కూడా మారుతుంది. మూడింట రెండు వంతుల పరిమితి అనేది మొత్తం సభ్యుల సంఖ్య ఆధారంగా కాకుండా సభలో ఉండి ఓటు వేసిన సభ్యుల సంఖ్య ఆధారంగా లెక్కిస్తారు. అందుకే రాజ్యాంగ సవరణ ఓటింగ్ సమయంలో ప్రతి ఎంపీ హాజరయ్యేలా చూసేందుకు ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు తమ శక్తినంతా ధారపోస్తాయి. ఏప్రిల్‌తో పోలిస్తే ఎన్డీయే ఇప్పుడు సంఖ్యాపరంగా చాలా మెరుగైన స్థితిలో ఉంది. కానీ ఇప్పటికీ సొంతంగా ప్రత్యేక మెజారిటీ సాధిస్తుందనే గ్యారెంటీ లేదు. ప్రస్తుతం లోక్‌సభలో అధికార కూటమికి దాదాపు 293 మంది ఎంపీల మద్దతు ఉంది. తృణమూల్‌కు చెందిన 20 మంది అసమ్మతి ఎంపీలు, యూబీటీ శివసేనకి చెందిన ఆరుగురు ఎంపీలు తోడైతే ఆ సంఖ్య 319కి చేరుతుంది. ఒకవేళ 22 మంది డీఎంకే ఎంపీలు అంశాల వారీగా మద్దతిస్తే ఎన్డీయే బలం దాదాపు 341కి పెరుగుతుంది. అయినప్పటికీ సభలో పూర్తి సంఖ్యలో ఎంపీలు హాజరైతే ఓటింగ్‌లో మూడింట రెండొంతుల మార్కు అందుకోవడానికి కేంద్రానికి ఇంకా కొంత సంఖ్యాబలం తగ్గుతుంది. కాబట్టి రాజ్యాంగ సవరణల బిల్లులను ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించుకుంటే ప్రాంతీయ పార్టీల మద్దతు, వ్యూహాత్మకంగా ఎంపీల గైర్హాజరీ, ప్రతిపక్షాల హాజరు తగ్గడం వంటి అంశాలపైనే బీజేపీ ఆధారపడే అవకాశం ఉంది.

## సభలో అయోధ్య విషయంపై నిలదీస్తాం

మొదటిపేజీ తరువాయి..

కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ పేర్కొంది. డీలిమిటేషన్, తీవ్రమైన నేరాల్లో అరెస్టై 30 రోజులకు మించి జైల్లో ఉన్న ప్రధానులు, సీఎంలు, మంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా గట్టిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. దిల్లీలో ఉన్న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) అధ్యక్షురాలు సోనియా గాంధీ నివాసంలో హస్తం పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, చిదంబరం, నసీర్ హుస్సేన్, మాణికం ఠాగూర్, తారిఖ్ అన్వర్, శశి థరూర్, మనీశ్ తివారీ తదితరులు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌లో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దేశంలో పేపర్ లీక్‌లు, ధరల పెరుగుదల, విదేశాంగ విధానం, అవినీతి ఆరోపణలు, అట్టడుగు వర్గాల హక్కులతో సహా పలు అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తెలిపారు. పౌరుల జీవితాలు, ఆశయాలపై ప్రభావం చూపే అత్యవసర అంశాలపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. సీపీపీ సమావేశం అనంతరం ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "అయోధ్య విరాళాల చోరీ, పేపర్ లీక్‌లు, విద్యా వ్యవస్థ క్షీణత, వ్యవస్థలను తమ గుప్పిట్లోకి తీసుకోవడం, రాజకీయ పార్టీలను చీల్చడం, కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు, ప్రజల నడ్డి విరిచే ధరల పెరుగుదల, విదేశాంగ విధాన వైఫల్యాలు, మోదీ ప్రభుత్వ వ్యూహాత్మక తప్పిదాలు, 3.5 కోట్ల వాహన యజమానులపై ఇథనాల్ మిశ్రమ విధానాన్ని రుద్దడం, అదుపులేని అటవీ నిర్మూలన, అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీల హక్కులపై నిరంతర దాడులు వంటి కీలక అంశాలపై రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తుంది. " అని ఖర్గే పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తిరిగి



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని యోచిస్తోందన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు దాని నిశిత పరిశీలనకు తమకు తగిన సమయం ఇవ్వాలని లేఖలో కోరారు. డీలిమిటేషన్ బిల్లు సవరించిన ప్రతిపాదనలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంలో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు తాను లేఖలు రాశానని ఖర్గే పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు ఆ అభ్యర్థనలను ఆయన పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ ప్రభుత్వానికి లోక్‌సభలో లభించలేదని పేర్కొన్నారు.

## ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం



మొదటిపేజీ తరువాయి..

మరోవైపు ఇరాన్‌పై అమెరికా ఒత్తిడిని మరింత పెంచుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు ఎలాంటి గడువు విధించలేదని స్పష్టం చేస్తూ, వాళ్లు జాగ్రత్తగా ఉండటం మంచిదని హెచ్చరించారు. అమెరికా సైన్యం 24 గంటల్లో మూడో విడత వైమానిక దాడులను నిర్వహించింది. ఇరాన్ సైన్యానికి చెందిన పలు స్థావరాలు, క్షిపణి వ్యవస్థలు, వ్యూహాత్మక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) వెల్లడించింది. సిస్తాన్-బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని 388వ మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ శిబిరంపై జరిగిన దాడిలో కనీసం ఏడుగురు సైనికులు మృతి చెందగా, పలువురు గాయపడినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఇటీవలి రోజుల అమెరికా దాడుల్లో మొత్తం 35 మందికిపైగా మరణించగా, 300 మందికి పైగా గాయపడినట్లు ఇరాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. అయితే వీరిలో ఎంతమంది పౌరులు, ఎంతమంది సైనికులు అనే వివరాలు వెల్లడించలేదు.అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్‌లపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిపినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఈ రెండు దేశాల్లో క్షిపణి హెచ్చరిక సైరన్లు మోగడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. జోర్డాన్ కూడా తమ గగనతలంలోకి వచ్చిన మూడు ఇరాన్ క్షిపణులను కూల్చివేసినట్లు ప్రకటించింది.ఇరాన్ వైపు ప్రయాణిస్తున్న ఓ ఖాళీ చమురు ట్యాంకర్‌ను నిర్వీర్యం చేసినట్లు సెంట్‌కామ్ వెల్లడించింది. పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఆ నౌక ప్రయాణాన్ని కొనసాగించడంతో ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. జులై 15న అరేబియా గల్ఫ్‌లో ఇరాన్ నౌకాశ్రయం వైపు వెళ్తున్న ట్యాంకర్‌పై ఈ చర్య చేపట్టినట్లు సెంట్‌కామ్ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న కురకావో జెండాతో నమోదైన ఎం/టి బెల్మా అనే వాణిజ్య నౌక ఇరాన్‌లోని ఖార్గ్ ద్వీపం వైపు వెళ్తున్నట్లు గుర్తించామని పేర్కొంది. నౌక సిబ్బందికి పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా అవి పట్టించుకోలేదని ఆరోపించింది. అమెరికా యుద్ధ విమానం హెల్‌ఫైర్ క్షిపణులను నౌక పొగ గొట్టం (స్మోక్‌స్టాక్)పై ప్రయోగించి ట్యాంకర్‌ను నిర్వీర్యం చేసినట్లు సెంట్‌కామ్ వెల్లడించింది. దీంతో ఆ నౌక ఇరాన్ వైపు ప్రయాణాన్ని కొనసాగించలేకపోయిందని తెలిపింది.పెన్సిల్వేనియాలో నిర్వహించిన డిఫెన్స్ అండ్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు చేరుకున్న ట్రంప్‌ను మీడియా ప్రశ్నించింది. ఇరాన్‌లోని కీలక మౌలిక సదుపాయాలపై దాడులకు ముందు టెహ్రాన్‌కు గడువు ఇచ్చారా అని అడగగా, "నేను గడువులు విధించడం ఇష్టపడను. పరిస్థితి ఏమిటో వారికి తెలుసు. వారు జాగ్రత్తగా ఉండాలి" అని సమాధానమిచ్చారు. అంతకుముందు ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ట్రంప్ ఇదే తరహా హెచ్చరికలు చేశారు. ఇరాన్ చర్చలకు ముందుకు రాకపోతే వచ్చే వారం నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, వంతెనలు వంటి కీలక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ప్రకటించారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

మొదటిపేజీ తరువాయి..

10 కోచ్‌లు ఉంటాయి. గరిష్ఠంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్-సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్,




క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రబ్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

## ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

మొదటిపేజీ తరువాయి..

తీసుకుంది. శాస్త్రవేత్తలకు రాజీనామాల నిబంధనలను కఠినతరం చేసింది. ఈ ఆదేశాలను అంతరిక్ష విభాగం గురువారం జారీ చేసింది. వాటిని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పలు కేంద్రాలకు కూడా పంపింది. భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్‌తోపాటు ఇతర 'ముఖ్యమైన మిషన్ల'కు అనుబంధంగా పని చేస్తున్న గ్రూప్- ఏ శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది నుంచి వచ్చే రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు యథావిధిగా అంగీకరించ వద్దని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగుల రాజీనామాతో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. శాస్త్రవేత్త, ఇంజనీర్ హోదా లేదా అంతకంటే తక్కువ స్థాయిలోని



సాంకేతిక సిబ్బంది నుంచి స్వీకరించిన రాజీనామాలను తమకు పంపాలని సదరు కేంద్రాలకు అంతరిక్ష విభాగం స్పష్టం చేసింది. అదికూడా ఆయా కేంద్రాల్లోని డైరెక్టర్ల స్పష్టమైన సిఫార్సులతో పంపాలని కోరింది. అయితే గ్రూప్- ఏ స్థాయిలోని ఉద్యోగుల రాజీనామాలను ఆమోదించేందుకు ఈ కేంద్రాల డైరెక్టర్లకు గతంలో ఇచ్చిన ఆదేశాలను తాజాగా అంతరిక్ష విభాగం రద్దు చేసింది. ఇటీవల ఇస్రో నుంచి 100 మందికి పైగా సిబ్బంది రాజీనామా చేశారంటూ వార్తా కథనాలు వెలువడ్డాయి. అందులో బెంగళూరులోని యూఆర్ఎస్సి, తిరువనంతపురంలోని వీఎస్ఎస్సి నుంచి పెద్ద ఎత్తున శాస్త్రవేత్తలు రాజీనామాలు చేశారు. ఆ జాబితాలో ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఈ రాజీనామాలు చేసిన శాస్త్రవేత్తలు అంతా.. స్పేస్ స్టార్టప్‌లలో చేరుతున్నట్లు సమాచారం. 2020లో అంతరిక్ష రంగంలోకి ప్రవేశించేందుకు ప్రైవేట్ సంస్థలను కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. 2023లో భారత అంతరిక్ష విధానాన్ని ప్రారంభించింది. నాటి నుంచి స్పేస్ స్టార్టప్‌లు దూసుకు వెళ్తున్నాయి. దేశంలో ప్రస్తుతం 400కు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయి. అవి 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2025లో వాటికి 150 మిలియన్ డాలర్లు సమకూరాయి. పిక్సెల్, ధ్రువ స్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఈ పోటీలో ముందున్నాయి.

## రీఫండబుల్ బాండ్ చెల్లించాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

నుంచి ఇమ్మిగ్రెంట్ వీసా కోసం దరఖాస్తు చేసే కొందరు అభ్యర్థులు ముందుగా ఒక నిర్దిష్ట మొత్తాన్ని బాండ్ రూపంలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఇమ్మిగ్రెంట్ వీసా పొందిన వ్యక్తులు అమెరికాలో చట్టబద్ధమైన శాశ్వత నివాసితులుగా ప్రవేశించే అవకాశం పొందుతారు. ఎంపిక చేసిన దరఖాస్తుదారులు గరిష్ఠంగా 100,000 అమెరికన్ డాలర్ల వరకు బాండ్ చెల్లించాల్సి రావచ్చు. ఈ విధానాన్ని మొదట కొద్ది దేశాల్లో మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసే అవకాశం ఉంది. అమెరికాలో ఇప్పటికే నివసిస్తున్న కుటుంబ సభ్యులు లేదా స్పాన్సర్లు దరఖాస్తుదారుల తరపున ఈ బాండ్ మొత్తాన్ని చెల్లించవచ్చు.




దరఖాస్తుదారు చివరకు అమెరికా పౌరసత్వం పొందిన తర్వాత ఈ బాండ్ మొత్తాన్ని తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది. అయితే ఈ పైలట్ ప్రోగ్రామ్‌లో ఏయే దేశాలను లేదా ఏ వర్గాల అభ్యర్థులను చేర్చనున్నారనే విషయాన్ని అమెరికా అధికారులు ఇప్పటివరకు ప్రకటించలేదు. ఈ ప్రతిపాదన భారతీయులకు ముఖ్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే భారతీయులు ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ నిరీక్షణను ఎదుర్కొంటున్నారు. అమెరికాలో ఉన్నత నైపుణ్యాలు కలిగిన ఐటీ, ఇంజినీరింగ్, వైద్య తదితర రంగాల నిపుణుల్లో భారతీయులే అధిక సంఖ్యలో గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేస్తున్నారు. అయితే అమెరికా ఇమ్మిగ్రేషన్ నిబంధనల ప్రకారం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒకే దేశానికి మొత్తం ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డుల్లో 7 శాతం కంటే ఎక్కువ కేటాయించడానికి అనుమతి లేదు. ప్రతి సంవత్సరం అమెరికా సుమారు 1.40 లక్షల ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డులు జారీ చేస్తుంది. అందులో ఒక్కో దేశానికి సుమారు 9,800 గ్రీన్ కార్డులు మాత్రమే లభించే అవకాశం ఉండటంతో భారతీయుల కోసం భారీ పెండింగ్ జాబితా ఏర్పడింది. వివిధ అంచనాల ప్రకారం, ప్రధాన దరఖాస్తుదారులు, వారి జీవిత భాగస్వాములు, పిల్లలు కలిపి 10 లక్షలకు పైగా భారతీయులు ప్రస్తుతం ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డ్ కోసం వేచి ఉన్నారు. వీరిలో చాలామందికి గ్రీన్ కార్డ్ పొందడానికి దశాబ్దాల పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.

## సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

మొదటిపేజీ తరువాయి..

'సూరహ్ ఫాతిహ్' రాసి, పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను విధుల నుంచి తొలగించింది. అలాగే భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల్లో ఆమెకు ఉద్యోగావకాశం కల్పించబోమని తెలిపింది. ఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో పాఠశాల వద్ద బీజేపీ నాయకులు నిరసన చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకు మతపరమైన అంశాలను నేర్చుకోవాలని చెప్పడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం



చేయగా, 'మా స్కూల్‌లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందే' అని సదరు టీచర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, ఈ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోమ్‌వర్క్ ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. కల్మా చదవాలని విద్యార్థికి హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ సెక్యులర్ సంఘాలు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా, భూ భారతి రీ సర్వే లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- సాంకేతికత జీపీఎస్ రోవర్ల తో ప్రభుత్వం సర్వే, సర్ 100% పూర్తి పట్ల గ్రామస్తులను ప్రశంసించిన. ఎమ్మెల్యే

**ఖానాపూర్ జూలై 16(ప్రజా జ్యోతి) :** తెలంగాణలో భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భూభారతి సర్వే నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యులు వెడ్మ బొజ్జు అన్నారు ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూరు మండలం హీరాపూర్ లో పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంచుకొని భూ భారతి రీ సర్వే కార్య క్రమం గురువారం జరిగింది ఇందులో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పాల్గొన్నారు శాశ్వత భూ యాజమాన్య హక్కులను కల్పించడం 'భూ భారతి' రీ-సర్వే యొక్క ముఖ్య ఉద్దేశం అని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్రంలో భూ భారతి ద్వారా ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికత (డ్రోన్లు, రోవర్లు, జీపీఎస్) ఉపయోగించి భూముల సరిహద్దులను శాస్త్రీయంగా కొలుస్తూ,కచ్చితమైన సరిహద్దులు శాస్త్రీయంగా భూ రికార్డులో నమోదు చేయడమే ప్రభుత్వం లక్ష్యం అన్నారు.ప్రభుత్వ అధికారులు మన గ్రామానికి సర్వేల కోసం వచ్చినప్పుడు పూర్తి సహకారం వారికి అందించి 100% సర్వే పూర్తి చేసుకోవాల ని ప్రజలను బొజ్జు పటేల్ కోరారు సర్ జాతీయ ఓటర్ ఎనమరేషన్ సర్వేలో అధికారులకు సహకరించి హీరాపూర్ గ్రామస్తులు ఫార్మ్స్ వంద శాతం అధికారులకు అందించినందుకు గ్రామస్తులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవ నిమిత్తం సీఎం సహాయనిది 4 లక్షల ఎల్ఓసి అందించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జో పటేల్



**ఖానాపూర్ జూలై 16(ప్రజా జ్యోతి) :** వైద్య సహాయం నిమిత్తం ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం మండలం మాసాయి పేట గ్రామానికి చెందిన గొల్లపల్లి లత హైదరాబాద్ నిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఖానాపూర్ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యమంత్రి సహాయనిది, ఆపరేషన్ కోసం 4 లక్షల రూపాయల ఎల్ఓసిని కుటుంబసభ్యులకు అందించారు. ధైర్యంగా ఉండాలని,వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## జిల్లా ఔషధ గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్

- వర్షాకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి





**మంచిర్యాల, 16, జూలై (ప్రజాజ్యోతి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ రావుతో కలిసి మంచిర్యాలలోని జిల్లా ఔషధ గిడ్డంగి (సెంట్రల్ డ్రగ్ స్టోర్)ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మాతా--శిశు సంరక్షణ కేంద్రాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ ఆసుపత్రులకు అవసరమైన 352 రకాల మందులను జిల్లా ఔషధ గిడ్డంగి ద్వారా సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, ఎక్స్‌పైరీ తేదీలు, సరఫరా విధానం తదితర అంశాలను డీఎంహెచ్‌వో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన అన్ని రకాల మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్స్‌పైరీ తేదీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, కుక్క, పాము, తేలు కాటు చికిత్సకు అవసరమైన మందులు, అత్యవసర మందులు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా నిల్వ ఉంచాలని సూచించారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని, మందుల నిల్వలు, పంపిణీ వివరాలను ప్రతిరోజూ నమోదు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం మందులను ఆయా ఆరోగ్య కేంద్రాలకు సకాలంలో చేరవేయాలని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కీటక జనిత, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, జ్వరాలు, అతిసారం, వాంతులు, విరేచనాల నివారణకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినంతగా నిల్వ ఉంచాలని సూచించారు. అలాగే మలేరియా, డెంగ్యూ నిర్ధారణ కిట్లను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. మందుల రవాణా కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్స్, ఆర్‌బీఎస్‌కే వాహనాలను వినియోగించాలని, రూట్‌వారీ యాక్షన్ ప్లాన్ రూపొందించి దాని ప్రకారం మందులను పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం గిడ్డంగిలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ శ్రీమతి శ్రీవాణి, ఫార్మసీ ఆఫీసర్లు చంద్రయ్య, శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, మలేరియా విభాగ అధికారులు శ్రీనివాస్, రవికిరణ్, సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బంది పాల్గొన్నారు.





# పెండింగ్ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలి







- ఎస్సీ ఎస్టీ సమీక్ష సమావేశం
- ఆ వర్గాల సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- తెలంగాణ రాష్ట్రకమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వెల్లడి

**ఖానాపూర్ జూలై 16(ప్రజా జ్యోతి) :** సమాజంలో మానవులంతా ఒకటేనని సమాంతర వ్యత్యాసాలు చూపకుండా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్సీ ఎస్టీ తెలంగాణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వెల్లడించారు గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉన్నతఅధికారులతో సమీక్ష సమావేశం కలెక్టర్ భవిష్ మిశ్రా అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, కమిషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద జాబ్‌కార్డుదారులకు కల్పిస్తున్న ఉపాధి వంటి అంశాలను సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు.

**ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే ప్రోగ్రాం నిర్వహించాలి :** ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు.

**ప్రతి మూడు మాసాలకు జిల్లా స్థాయిలో సమావేశం జరగాలి :** అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి తగిన పని దినాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన అభివృద్ధి నిధులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదలయ్యేలా కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు.

**ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్నాం కలెక్టర్ భవేష్ మిశ్రా వెల్లడి :** ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకుల ద్వారా 199 ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు

**ఎస్సీ ఎస్టీ అట్రాసిటీలి లికేసులకు సత్వర పరిష్కారం :** జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని, వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ఎస్సీ ఎస్టీ పారిశుద్ధ కార్మికుల పై దృష్టి సారించాలి కమిషన్ సభ్యుల వినతి :** కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 60 సంవత్సరాలు పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఆర్‌ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, డి పి ఆర్ ఓ విష్ణు.ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సోనం వాంగ్చుక్ ప్రాణాలు కాపాడాలి: ప్రజాసంఘాలు





- నీట్ వైఫల్యంపై కేంద్ర విద్యా మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- మంచిర్యాలలో ప్రజాసంఘాల నిరసన

**మంచిర్యాల, 16, జూలై (ప్రజాజ్యోతి) :** ఢిల్లీలో 19 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్న సోనం వాంగ్చుక్‌తో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి ఆయన దీక్షను విరమింపజేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సోనం వాంగ్చుక్ 19 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యమకారులతో చర్చలు జరిపి సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌పాల్ బిల్లు కోసం అన్నా హజారే చేపట్టిన నిరాహార దీక్ష సందర్భంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చిందని గుర్తు చేస్తూ, ప్రస్తుతం కూడా అదే విధమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించాలని సూచించారు. సోనం వాంగ్చుక్ దేశానికి సేవలందించిన శాస్త్రవేత్త, పర్యావరణవేత్త అని, ఆయన ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారిని దేశద్రోహులు లేదా విదేశీ ఏజెంట్లుగా ముద్ర వేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. విద్యారంగంలో సమూల సంస్కరణలు చేపట్టడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర స్పందన వేదిక కన్వీనర్ క్యాతం రవికుమార్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, బీసీ మేధావుల ఫోరం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామోజు కొండయ్య, తెలంగాణ జన సమితి నాయకుడు ప్రదీప్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు జైపాల్ సింగ్, సామాజిక ఉద్యమకారులు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, మోతె రామదాసు, శ్రీమన్నారాయణ, బొజ్జ శరత్, సంకె రవి, గోగుల రవీందర్ రెడ్డి, రాధేశ్యాం, వేముల కిరణ్, షబ్బీర్ పాషా, కైలాసం, పడాల శ్రీనివాస్, మధు, జాగిరి రాజేష్, పూరెల్ల నితీష్, అంకం సాగర్, మెరుగు సతీష్, సమ్మయ్య, మహ్మద్ ఇబ్రహీం, కట్ట ప్రకాష్, మిడివెల్లి రాజ్‌కుమార్, అడ్వాల లింగమూర్తి, రాజగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో నేటి నుంచి మెడికల్ బోర్డు......

- మెడికల్ బోర్డు నిష్పక్షపాతంగా జరిగేనా..? - అర్హులైన వారసులకు ఉద్యోగాలు దక్కేనా..?




**మంచిర్యాల, 16, జూలై (ప్రజాజ్యోతి) :** సింగరేణి కార్మికులు ఎన్నో నెలలుగా ఎదురుచూస్తున్న మెడికల్ బోర్డు ప్రక్రియ నేటి నుంచి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన వైద్యశాలలో ప్రారంభం కానుంది. రెండు రోజులపాటు కొనసాగే ఈ ప్రక్రియలో తొలి రోజు కార్మికులకు వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, రెండో రోజు ప్రభుత్వ వైద్యుల సమక్షంలో మెడికల్ బోర్డు సమావేశమై నివేదికల ఆధారంగా ఉద్యోగులను వైద్యపరంగా అర్హులు, అనర్హులుగా నిర్ణయించనుంది. మెడికల్ బోర్డు కోసం దరఖాస్తు చేసుకున్న సింగరేణి కార్మికులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వైద్యపరంగా అనర్హులుగా ప్రకటించబడితే కారుణ్య నియామకాల ద్వారా తమ కుమారుడు, కుమార్తె లేదా అల్లుడికి ఉద్యోగం లభిస్తుందనే ఆశతో ఎంతోకాలంగా ఈ ప్రక్రియ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ అంశంపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపినట్లు పేర్కొంటున్నాయి. మరోవైపు హెచ్ఎంఎస్, సీఐటీయూ, బీఎం ఎస్ తదితర కార్మిక సంఘాలు, బీఆర్ఎస్, బీజేపీ వంటి రాజకీయ పార్టీలు కూడా మెడికల్ బోర్డు నిర్వహణలో జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళనలు, విమర్శలు, హెచ్చరికలు చేశాయి. బోర్డు ప్రారంభం కావడంతో ఇప్పుడు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు తమ పోరాట ఫలితంగానే ఈ నిర్ణయం వచ్చిందని ప్రచారం చేస్తున్నాయి. అయితే కార్మికుల్లో మాత్రం రెండు ప్రశ్నలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మెడికల్ బోర్డు పూర్తిగా నిష్పక్షపాతంగా జరుగుతుందా? అర్హులైన కార్మికులకు మాత్రమే మెడికల్ అన్‌ఫిట్ ప్రకటించి వారి వారసులకు ఉద్యోగాలు కల్పిస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మెడికల్ బోర్డు ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, కొందరు మధ్యవ ర్తుల ద్వారా భారీ మొత్తంలో డబ్బులు చేతులు మారాయని ఆరోపణలు రావడం తెలిసిందే. అర్హత లేని వారిని కూడా ప్రభావితం చేసి అన్‌ఫిట్‌గా ప్రకటించారనే విమర్శలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణల నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజిలెన్స్ విచారణకు ఆదేశించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2017 నుంచి ఇటీవల వరకు జరిగిన మెడికల్ బోర్డులపై విచారణ కొనసాగుతున్న తరుణంలో నిర్వహిస్తున్న ఈ బోర్డుపై కార్మికుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈసారి ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తారా? నిజంగా అర్హులైన కార్మికులకు మాత్రమే న్యాయం జరుగుతుందా? అనే అంశాలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మెడికల్ బోర్డు ద్వారా అనర్హులుగా ప్రకటించబడిన కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు లభించే అవకాశం ఉండటంతో వేలాది కుటుంబాల భవిష్యత్తు ఈ ప్రక్రియపై ఆధారపడి ఉంది. అందువల్ల ప్రతి దశను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించి, మధ్యవర్తులు, అవినీతికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాలు, పరిశీలకులు కోరుతున్నారు. ఈసారి మెడికల్ బోర్డు నిజంగా పారదర్శకంగా జరిగి అర్హులైన కార్మికులకు న్యాయం చేస్తుందా? లేక మరోసారి వివాదాలకు కేంద్రబిందువుగా మారుతుందా? అన్నది మరో రెండు రోజుల్లో తేలనుంది.

## వర్షాల కోసం వినూత్న ప్రార్థన

: పల్లెల్లో కప్పతల్లి ఆట




**సోనాల, జులై 16 (ప్రజాజ్యోతి) :** సోనాల మండలం లోని కోట(కె) గ్రామంలో గ్రామ యువకులు పెద్దలు కప్ప తల్లి ఊరేగింపు తీసి, గ్రామంలోని అన్ని దేవతలకు పూజలు చేయడం జరిగింది. తమ గ్రామంతో పాటు సోనాల మండలం మరియు ఆదిలాబాద్ జిల్లాలో వర్షం బాగా కురవాలని పంటలు సమృద్ధిగా పండాలని రైతన్నలు సుఖ సంతోషాలతో ఉండాలని తమ గ్రామంలో వున్న అన్ని దేవతల ఆశీస్సులు తమ పై మరియు జిల్లా రైతన్నల పై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ తథానంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సంగ్రామ్, పవన్, బాలాజీ మరియు గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండో వార్డ్ హెల్ప్ డెస్క్‌లో బిఎల్ఓ బిఎల్ఏలకు ప్రోత్సాహం



**ఖానాపూర్ జూలై 16(ప్రజాజ్యోతి) :** ఖానాపూర్ మున్సిపాలిటీ లోని రెండవ వార్డులో గత వారం గా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఓటర్ సమాచార నమోదు కేంద్రం ద్వారా 80% ఓటర్ల పాములు అందజేసినందున వార్డ్ కౌన్సిలర్ తాళ్లపల్లి రాజ గంగన్న మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ ఆధ్వర్యంలో బిఎల్ఓ జ్యోతికతో పాటు బిఎల్ఏలను ఉత్సాహపరుస్తూ అక్కడి యువతను సైతం శాలతో సత్కరించారు ఓటు హక్కు మన జన్మ హక్కు అని దాన్ని కాపాడుకోవడంలో భాగంగా జాతీయ కమిషనర్ ఆదేశాలతో సర్ ప్రోగ్రాం విజయవంతానికి అందరు కృషిచేసి ఓటును కాపాడుకోవాలని కౌన్సిలర్ రాజ గంగన్న అన్నారు ఈ కార్యక్రమంలో కారింగుల రాములు రాజేశ్వర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్ రాజేందర్ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాజ్యోతి"కథనానికి స్పందించిన శానిటేషన్ ఇన్స్పెక్టర్







**మంచిర్యాలరూరల్ జులై 16 (ప్రజాజ్యోతి) :** గోదావరి నదిలోని అపరిశుభ్ర వాతావరణంపై ఈ నెల 13న ప్రజాజ్యోతి పత్రికలో ప్రచురితమైన "గోదావరి తీరంలో పరిశుభ్రత కరువు"అనే కథనానికి స్పందించిన మంచిర్యాల కార్పొరేషన్ సానిటేషన్ విభాగం ఇన్స్పెక్టర్ సునీల్ ఆధ్వర్యంలో కార్మికులు తక్షణ చర్యలు చేపట్టారు.గోదావరి నదీతీరంతో పాటుగా పరిసరాలను శుభ్రపరిచి, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుకూల వాతావరణం కల్పించారు. అదనంగా నది పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పరిశుభ్రత చర్యలను మరింత వేగవంతం చేశారు.స్థానిక ప్రజలు భక్తులు ఈచర్యలను అభినందిస్తూ,గోదావరి పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని కోరారు.

## ఔషధాల సరఫరాపై డిఎంహెచ్ఓ ప్రత్యేక దృష్టి





**మంచిర్యాలరూరల్ జులై 16 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల్ జిల్లా ఔషధ గిడ్డంగి (సెంట్రల్ డ్రగ్ స్టోర్)ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.అనిల్ రావుతో కలిసి మం దుల నిల్వలు,ఎక్స్‌పైరీ డేట్లు, అత్యవసర మందుల లభ్యతను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మలేరియా, డెంగ్యూ,జ్వరాలు, అతిసారం వంటి వ్యాధులకు సంబంధించిన మందులు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# మంత్రుల పర్యటనలు హడావుడికే పరిమితం

గద్వాల జిల్లా ప్రజా జ్యోతి జులై 16:
గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం



నిర్వహించిన మీడియా సమావేశంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.మంత్రులు గద్వాలకు వస్తున్నప్పటికీ అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు.పెండింగ్ ప్రాజెక్టులు,రైతుల సమస్యలు,ట్రాన్స్‌ఫార్మర్ కొరత వంటి అంశాలను ప్రభుత్వం నిర్లక్ష్యంచే స్తోందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్ పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.

# గుండె శస్త్రచికిత్సల్లో కొత్త అధ్యాయం చిన్న కోతతో పెద్ద విజయం..

మహబూబ్‌నగర్, జులై 15 (ప్రజా జ్యోతి బ్యూరో ) గుండె శస్త్రచికిత్స అంటే పెద్ద కోత, ఛాతీ ఎముకను పూర్తిగా తెరవడం, అధిక రక్తస్రావం, ఎక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుందనే అభిప్రాయం ఇప్పుడు గతమైందని యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ యూనిట్ సీనియర్ కన్సల్టెంట్ కార్డియోవాస్కులర్ అండ్ థొరాసిక్ సర్జన్ డా. సత్య శ్రీధర్ కాలే తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆధునిక వైద్య సాంకేతికతతో మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ (ఎం ఐ సీ ఎస్ ), రోబోటిక్ కార్డియాక్ సర్జరీ ద్వారా గుండె శస్త్రచికిత్సలను అత్యంత సురక్షితంగా, కచ్చితత్వంతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సాంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీతో పోలిస్తే మినిమల్లీ ఇన్వాసివ్ విధానంలో కేవలం కొన్ని సెంటీమీటర్ల చిన్న కోతల ద్వారానే శస్త్రచికిత్స పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. దీనివల్ల రక్తస్రావం, శస్త్రచికిత్స అనంతర నొప్పి, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గడంతో పాటు ఐసీయూ, ఆసుపత్రిలో ఉండాల్సిన రోజులు కూడా గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. రోబోటిక్ కార్డియాక్ సర్జరీలో అత్యాధునిక రోబోటిక్ వ్యవస్థల సహాయంతో అత్యంత సూక్ష్మమైన కదలికలను కూడా ఖచ్చితంగా నియంత్రించవచ్చని, క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలను మరింత



సురక్షితంగా నిర్వహించేందుకు ఇది ఎంతో దోహదపడుతోందని పేర్కొన్నారు. మిట్రల్ వాల్వ్, ట్రైకస్పిడ్ వాల్వ్ సమస్యలు, గుండెలో రంధ్రాలు (ఏ ఎస్ డి ), ఎంపిక చేసిన బైపాస్ శస్త్రచికిత్సలు, గుండెలోని కొన్ని కణితులకు కూడా ఈ ఆధునిక విధానాలు విజయవంతంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ విధానాల్లో శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు తక్కువ సమయంలోనే నడవడం ప్రారంభించి త్వరగా ఇంటికి చేరుకోవచ్చని, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు తమ సాధారణ జీవితానికి వేగంగా తిరిగి చేరుకునేందుకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతోందన్నారు. శరీరంపై పెద్ద మచ్చలు లేకపోవడం కూడా రోగులకు మానసికంగా ధైర్యాన్నిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం యువతలో కూడా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నడిచినప్పుడు ఆయాసం, గుండెదడ, కాళ్ల వాపు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుండె నిపుణులను సంప్రదించాలని డా. సత్య శ్రీధర్ కాలే సూచించారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రపంచ స్థాయి వైద్య సాంకేతికత, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, రోబోటిక్ శస్త్రచికిత్స సదుపాయాలు, అనుభవజ్ఞులైన కార్డియాక్ సర్జన్లు, కార్డియాలజిస్టులు, అనస్థీషియా నిపుణులు, ప్రత్యేక శిక్షణ పొందిన నర్సింగ్ బృందంతో యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ యూనిట్ గుండె చికిత్సలో దేశంలోని ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా సేవలందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, ఆర్. రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు యూనివర్సిటీలోనే జాతీయ సెమినార్ నిర్వహించాలి

- మూడో రోజుకు చేరిన సంతకాల సేకరణ..
- ఏకమవుతున్న విద్యార్థి సంఘాలు

మహబూబ్‌నగర్, జూలై 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ) పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించాల్సిన జాతీయ సెమినార్‌ను అదే విశ్వవిద్యాలయంలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. విద్యార్థుల అభిప్రాయ సేకరణలో భాగంగా గురువారం మూడో రోజు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించగా, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లా స్టూడెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సుదీప్ రెడ్డి, విద్యార్థి నాయకురాలు సంధ్య కార్తీక్ మాదిగ మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా పాలమూరు ప్రాంతానికి జాతీయ సెమినార్ నిర్వహించే అవకాశం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. అలాంటి అవకాశాన్ని పాలమూరు యూనివర్సిటీకి కేటాయించిన తర్వాత వేరే ప్రాంతానికి తరలించడం విద్యార్థులు, అధ్యాపకులు, ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శించారు. పాలమూరు ప్రాంతం విద్యా, పరిశోధనా రంగాల్లో మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ఇక్కడ జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం వల్ల దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయానికి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉండటంతో పాలమూరు యూనివర్సిటీ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని అన్నారు.అందువల్ల ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి జాతీయ సెమినార్‌ను పాలమూరు యూనివర్సిటీలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ లక్ష్యంతో విద్యార్థుల సంతకాల సేకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మారుతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రాము, పీయూ జేఏసీ కన్వీనర్ సాయి అభినయ్, బీఆర్ఎస్వీ నాయకుడు వెంకటేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు శ్రీను మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# సాంకేతికతను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలి

- రూ.1.35 కోట్లతో జిల్లాలో 16 ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు
- మర్రికుంట కేజీబీవీలో ప్రారంభించిన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

వనపర్తి ప్రతినిధి, జూలై 16 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆధునిక విద్యా బోధనకు ఊతమిస్తూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో జిల్లాలో రూ.1.35 కోట్ల





వ్యయంతో 16 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో భాగంగా వనపర్తి జిల్లా మర్రికుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను గురువారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలిసి ప్రారంభించారు. అనంతరం స్మార్ట్ బోర్డుపై సంతకం చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో విద్య అందించాలనే లక్ష్యంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులను వినియోగించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ విద్యార్థి దశలో ఇలాంటి స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అందుబాటులో లేవని, నేటి విద్యార్థులు ఈ అవకాశాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులతో ఎంపీ ప్రత్యేకంగా ముచ్చటించి వారి లక్ష్యాలు, చదువుపై ఆసక్తిని తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, సాంకేతికత ఆధారిత బోధనతో విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను సమర్థంగా వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శివకుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మహబూబ్‌నగర్ క్లస్టర్ హెడ్ ప్రవీణ్ కుమార్ ఝా, జీఐబీ స్టేట్ హెడ్ పి.జె. శ్రావణ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అలసత్వం సహించం: ఎంపీ మల్లు రవి

- అదనంగా వసతి గృహాలు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

వనపర్తి ప్రతినిధి, జూలై 16 (ప్రజాజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తులో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2020 నుంచి 2026 వరకు ఒక్క అట్రాసిటీ కేసులోనూ నేరారోపణ (ఫ్రేమింగ్ ఆఫ్ ఛార్జెస్) జరగకపోవడం దురదృష్టకరమని అధికారులను ప్రశ్నించారు. అత్యాచారాలు, దౌర్జన్యాల కేసుల్లో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పకడ్బందీగా ఛార్జిషీట్లు దాఖలు చేసి దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. 2018 నుంచి నమోదైన అట్రాసిటీ కేసులు, విచారణ పురోగతి, బాధితులకు పరిహారం తదితర అంశాలపై కేసుల వారీగా సమీక్ష నిర్వహించారు. 2025-26లో విచారణలో ఉన్న 12 కేసుల వివరాలను జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి కమిటీకి వివరించారు. 2020లో నమోదైన కేసు ఇప్పటికీ ట్రయల్‌కు రాకపోవడంపై ఎంపీ విస్మయం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడారు. భూ ఆక్రమణలు, ఎస్సీ, ఎస్టీల భూముల కబ్జా వంటి కేసులకు అత్యంత




ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి నెల పౌరహక్కుల దినోత్సవాన్ని సమర్థంగా నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల పెరుగుతున్న చేరికలకు అదనపు హాస్టళ్లు కావాలి సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు, సైకిళ్లు తదితర సౌకర్యాల కల్పనతో ఈ ఏడాది విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. పెరిగిన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అదనపు వసతి గృహాలు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. రూ.75 లక్షల పరిహారం పెండింగ్ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు దాదాపు రూ.75 లక్షల పరిహారం చెల్లించాల్సి ఉన్నా నిధుల కొరతతో పెండింగ్‌లో ఉందన్నారు. నిధులు త్వరగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. అలాగే తప్పు చేసిన వారికి తప్పనిసరిగా శిక్షలు పడేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

# విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం:షీ టీమ్

అయిజ జూలై 16(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో గురువారం అయిజ మండలం పులికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో






విద్యార్థినీ,విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీమ్ సేవలు,మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు,పోక్సో చట్టం,సైబర్ నేరాల నివారణ,వ్యక్తిగత భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.విద్యార్థులు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు.మహిళల హక్కులు,లింగ సమానత్వం,పరస్పర గౌరవం,సమ్మతి (కన్సెంట్) యొక్క చట్టపరమైన ప్రాముఖ్యతను సులభమైన ఉదాహరణలతో వివరించారు.అనుమతి లేకుండా చేసే ఏ చర్య అయినా చట్టరీత్యా నేరమేనని స్పష్టం చేశారు.సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద లింకులు,ఫేక్ అకౌంట్లు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.లైంగిక వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్,స్టాకింగ్ వంటి ఘటనలు ఎదురైతే ఆలస్యం చేయకుండా షీ టీమ్ హెల్ప్‌లైన్ 87126 70312కు సమాచారం అందించాలని కోరారు.టీనేజ్ వయస్సులో ఎదురయ్యే భావోద్వేగ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని,అవసరమైతే షీ టీమ్ సహాయం పొందవచ్చని వివరించారు.అలాగే రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలు,హెల్మెట్ వినియోగం,మద్యం,గంజాయి,డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 సేవల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో చట్టాలపై అవగాహనతో పాటు భద్రతపై విశ్వాసాన్ని పెంపొందిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉష తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్సై రాణి,సభ్యులు శేషన్న,దివ్యవాణి,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# గుర్రంగడ్డను ఆధ్యాత్మిక-పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలున్నాయి:డిప్యూటీ కలెక్టర్లు

గద్వాల జూలై 16(ప్రజా జ్యోతి ప్రతినిధి): భూ భారతి రీ-సర్వే కార్యక్రమంపై గ్రామీణ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం గుర్రంగడ్డ గ్రామాన్ని డిప్యూటీ కలెక్టర్లు నన్నూరి మనోజ్ కుమార్ రెడ్డి,జి.రాజ్ కుమార్ గురువారం సందర్శించి గ్రామసభ నిర్వహించారు.కృష్ణా నది ఒడ్డున ఉన్న గుర్రంగడ్డ గ్రామంలో ప్రస్తుతం నీటి మట్టం తగ్గడంతో గ్రామస్థులు ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గం ద్వారా అధికారులు గ్రామానికి చేరుకున్నారు.గ్రామసభలో భూ భారతి రీ-సర్వే కార్యక్రమం లక్ష్యాలు,భూ రికార్డుల ఖచ్చితత్వం,రైతులకు కలిగే ప్రయోజనాలు,భూ వివాదాల నివారణ,రికార్డుల పారదర్శకతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని,తాత్కాలిక దారి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని,గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేసి ఏఎన్ఎంను నియమించాలని కోరారు.నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి సిబ్బందిని నియమించాలని,భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ భూములను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులు,ఉపాధ్యాయులు,గ్రామస్థులతో మాట్లాడారు.తరువాత శ్రీ జమ్ములమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఘాట్ మెట్లు,స్నాన ఘట్టాలు,యాత్రికుల విశ్రాంతి కేంద్రాలు,తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు కోరారు.కృష్ణా నదిలో పడవ ప్రయాణం చేసిన అధికారులు అక్కడి సహజ సిద్ధమైన ప్రకృతి అందాలు, పడవ విహారానికి ఉన్న అవకాశాలు,స్థానిక చేపల వంటకాలు,జమ్ములమ్మ ఆలయ ఆధ్యాత్మిక ప్రాధాన్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ నన్నూరి మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,"ఆధ్యాత్మికత,ప్రకృతి,పర్యాటకం కలిసిన అరుదైన ప్రాంతం గుర్రంగడ్డ.జమ్ములమ్మ జన్మస్థలమైన ఈ ప్రాంతాన్ని అవసరమైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తే జూరాల తరహా ఆధ్యాత్మిక-పర్యాటక కేంద్రంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది"అని అన్నారు.గ్రామస్థులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.డిప్యూటీ కలెక్టర్ జి.రాజ్ కుమార్ మాట్లాడుతూ,"గుర్రంగడ్డలో వంతెన నిర్మాణం పూర్తి



కావడం,జమ్ములమ్మ జన్మస్థలంగా విస్తృత ప్రచారం కల్పించడం, బోటింగ్,పర్యాటక చేపల వేట వంటి కార్యకలాపాలను అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతం ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది.ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం"అని తెలిపారు.అదే సమయంలో భూ భారతి రీ-సర్వే కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి గ్రామస్థుడు పూర్తి సహకారం అందించి తమ భూ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు పిలుపునిచ్చారు. గ్రామస్థులు కూడా రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# రైతులు అయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాలి

-ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ : జులై 16(ప్రజా జ్యోతి) రైతులు అయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించి వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా అధిక ఆదాయం పొందాలని,ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకమైన పంటగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు.గురువారం అచ్చంపేట మండలంలోని లింగోటం గ్రామ ప్రగతిశీల రైతు రాజశేఖర్ గౌడ్ తన 4 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్ ఫామ్ తోటను ఉద్యాన శాఖ,ఆయిల్ ఫామ్ కంపెనీ అధికారులతో కలిసి కలెక్టర్ హెమంత కేశవ్ పాటిల్ పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని రైతులందరూ





సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఆయిల్ ఫామ్ సాగు,నిర్వహణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ,వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.విజయం సాధించన రైతు అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడంతో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతు రాజశేఖర్ గౌడ్ ను శాలువాతో సత్కరించి అభినందించి సాధించిన విజయాన్ని కొనియాడుతూ, ఇదే స్ఫూర్తితో రైతులందరు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు.భారత వాతావరణ శాఖ అధికారం వెల్లడించిన వివరాల ప్రకారం ఈ సంవత్సరం వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులున్నాయని,ప్రాజెక్టు ల్లో కూడా నీటి నిలువలు త్రాగునీటి అవసరాల మేరకే ఉన్నాయని,ఈ విషయాలను గమనించి రైతులు ప్రత్యామ్నాయ పంటలను పండించేలా ముందుకు రావాలన్నారు. కొంతమంది రైతులు 30 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రాగా,వారిని అందరిని అభినందించి,అందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు.రైతు రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటడం జరిగిందని,ఈ ఏడాది మొదటి సారిగా వాణిజ్య స్థాయిలో దిగుబడి ప్రారంభమైందని ఎకరానికి సుమారు నాలుగు టన్నుల చొప్పున మొత్తం 16 టన్నుల ఆయిల్ ఫామ్ గింజలు ఉత్పత్తి అయ్యాయని,ప్రభుత్వం నిర్ణయించిన
ధర ప్రకారం ప్రతి టన్నుకు 23,783 చొప్పున 3,65,000 ఆదాయం వచ్చిందని ఆయిల్ ఫామ్ సాగులో డ్రిప్ ఇరిగేషన్‌ను వినియోగిస్తున్నానని ఈ పంటకు నీటిఅవసరం తక్కువగా ఉండటంతో పాటు,నీటి వినియోగం కూడ సమర్థవంతంగా ఉంటుందని సరైన నిర్వహణ,ఎరువు వినియోగం, సమయానుకూల సంరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశం మాట్లాడుతూ ఆయిల్ ఫామ్తో టల్లో పండిన గెలలను ఎలా గుర్తించాలి,కోతకు సరైన సమయం,ఏ విధానంలో గెలలను కోయాలి, కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలను వివరిస్తూ రైతు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే దిగుబడి పెరుగుతుందని ఆయిల్ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అందజేస్తోందని మొక్కలు నాటిన సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల ప్రతి ఎకరానికు 4,200 ఆర్థిక సహాయాన్ని అందజేస్తు
న్నట్లు తెలిపారు.కలెక్టర్ వెంట ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం,అచ్చంపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్,నాగర్ కర్నూల్ శాఖ అధికారి జగన్, వ్యవసాయ అధికారులు,గ్రామ సర్పంచ్ వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# బ్రేక్యల్ ప్లెక్సస్ ఇంజురీకి సకాలంలో చికిత్సతో చేయి మళ్లీ పనిచేసే అవకాశం

- అవగాహన లోపంతో చికిత్స ఆలస్యమైతే శాశ్వత వైకల్యానికి దారితీస్తుంది: డా. పి. ప్రకాష్

మహబూబ్‌నగర్, జూలై 16 (ప్రజా జ్యోతి బ్యూరో): రోడ్డు ప్రమాదాల అనంతరం చేయి కదలకపోవడం, స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదిస్తే చేయి తిరిగి సాధారణ స్థితికి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని హైదరాబాద్ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్ ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్, బ్రేక్యల్ ప్లెక్సస్ నిపుణుడు డా. పి. ప్రకాష్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రేక్యల్ ప్లెక్సస్ ఇంజురీ అనేది చేతికి కదలికలు, స్పర్శను అందించే నరాలు దెబ్బతినే తీవ్రమైన సమస్య అని వివరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో యువత, టీనేజ్ వయస్సు వారిలో ఈ గాయాలు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు.




రోడ్డు ప్రమాదం తర్వాత చేయి పూర్తిగా పనిచేయకపోవడం, భుజం లేదా మోచేయి కదలకపోవడం, చేయి చచ్చుబడినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపించినా చాలామంది వాటిని నిర్లక్ష్యం చేస్తూ ఫిజియోథెరపీతోనే సరిపెట్టుకుంటున్నారని, దీంతో చికిత్స ఆలస్యం కావడంతో శస్త్రచికిత్స ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండవని ఆయన పేర్కొన్నారు.
దెబ్బతిన్న నరాల తీవ్రతను బట్టి నరాలను తిరిగి కలపడం, నర్వ్ ట్రాన్స్‌ఫర్, కండరాల మార్పిడి, టెండన్ ట్రాన్స్‌ఫర్ వంటి ఆధునిక శస్త్రచికిత్సల ద్వారా చేతి పనితీరును గణనీయంగా పునరుద్ధరించవచ్చని డా. ప్రకాష్ తెలిపారు.
ప్రమాదం జరిగిన వెంటనే సరైన వైద్యుడిని సంప్రదించి చికిత్స ప్రారంభిస్తే రోగులు తిరిగి తమ దైనందిన పనులను స్వయంగా చేసుకునే స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. బ్రేక్యల్ ప్లెక్సస్ ఇంజురీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల బాధితులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకుని సకాలంలో నిపుణుల సలహాలు పొందాలని ఆయన కోరారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పనులను సమీక్షించిన ఎంపీడీఓ శంకర్ నాయక్



**పర్వతగిరి, జూలై 16 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా డేటా ఎంట్రీ, బూత్‌ల వారీ పురోగతిని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ హరిత, పంచాయతీ కార్యదర్శి రఘుతో కలిసి వివిధ బూత్‌లలో జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తులు, నమోదు పనుల పురోగతిని పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఎంపీడీఓ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో ప్రక్రియను పూర్తి చేయాలని, బూత్‌ల వారీగా పెండింగ్ వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ అనిత, వివో స్రవంతి, బీఎల్ఏలు మేడిశెట్టి కరుణాకర్, నాదారపు స్వప్న, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలతోనే అధిక లాభాలు

- అప్పలరావుపేట రైతు సదస్సులో శాస్త్రవేత్తల పిలుపు
- సేంద్రియ పద్ధతులతో మేలైన దిగుబడులు

: నెక్కొండ ఉద్యాన అధికారి తరుణ్



**నెక్కొండ, జూలై 16 (ప్రజా జ్యోతి) :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పలరావుపేట గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటలలో మెరుగైన సాగు యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన అవగాహన–శిక్షణ కార్యక్రమం విజయవంతమైంది. గ్రామ సర్పంచ్ వి. అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో టెక్నికల్ హార్టికల్చర్ అధికారి చి. రాకేష్ మాట్లాడుతూ పసుపు, అరటి, ఆయిల్‌పామ్ పంటలలో ఆధునిక సాగు పద్ధతులు, సమతుల్య ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగ సామర్థ్యం, సమగ్ర చీడపీడల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు రైతులు సంప్రదాయ పంటలతో పాటు అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ఎన్ఎస్‌టస్ మాస్టర్ ట్రైనర్ కె. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ రసాయన వ్యవసాయం అధికమవుతున్న నేపథ్యంలో రైతులు పరిశుభ్రమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, సేంద్రియ ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రియ విధానాలను అనుసరించడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయని వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డా. ఎ. రాజు మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ముఖ్యంగా ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ఉద్యాన పంటలలో అంతర పంటల సాగు ఎంతో ఉపయోగకరమని, దీనివల్ల అదనపు ఆదాయంతో పాటు వాతావరణ ప్రమాదాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. నెక్కొండ ఉద్యాన అధికారి తరుణ్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటలు, కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ విస్తరణతో పాటు వివిధ పంటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల గురించి వివరించి, అర్హులైన రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ వి. అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని రైతులను ఉద్యాన పంటల సాగు వైపు ప్రోత్సహించేందుకు పూర్తి సహకారం అందిస్తానని, ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హ రైతుకు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిపుణులతో సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## తెలంగాణలో వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయాలి

బిజెపి ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం



**ములుగు,జూలై 16(ప్రజా జ్యోతి) :** తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకంను రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని బిజెపి ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ములుగు కలెక్టర్ కార్యాలయంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాడి రామరాజు ఆధ్వర్యంలో కలెక్టరేట్(ఏఓ) పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిజెపిములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ.. దేశంలోని అనేక రాష్ట్రాల్లో రైతులకు పంట నష్టం సమయంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ఆర్థిక భరోసా లభిస్తోందని,కానీ తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయకుండా రైతులను ఆ హక్కు నుండి దూరం చేస్తోందని విమర్శించారు.అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలైన ఎకరాకు రూ.15 వేల పెట్టు బడి సాయం,కౌలు రైతులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం వంటి హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలుకాలేదని ఆరోపించారు.ఎన్నికల హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ,రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్య జవహర్ లాల్,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రాచారి,జిల్లా ఉపాధ్యక్షులు ఆచార్య జినుకల కృష్ణాకర్ రావు,అల్లె శోభన్,ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకన్న,జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు సుమలత, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జితేందర్ రావు, గుగులోతు స్వామి నాయక్, ఇర్సవడ్ల జగన్,రవి రెడ్డి, నాయకులు,ములుగు మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, ఇమ్మడి రాకేష్ యాదవ్, కిసాన్ మోర్చ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## రేవూరి కోర్టులో 'చింతలపల్లి' పంచాయితీ..

# చైర్మన్ పీఠం ఎవరికి..?







'సహకార' పీఠం..'తీగల'కు దక్కేనా న్యాయం..?

చింతలపల్లి వేదికగా కాంగ్రెస్‌లో 'తీగల' వర్గం చర్చ..!

తీగల రవీందర్ గౌడ్ కుటుంబానికి గుర్తింపు దక్కేనా

నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ సేవకు ప్రతిఫలం దక్కాలని డిమాండ్

**సంగెం, జూలై 16 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి సహకార సంఘం (సొసైటీ) చైర్మన్ పదవి ఎంపికపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకులు కీర్తిశేషులు తీగల రవీందర్ గౌడ్ కుటుంబానికి పార్టీ అధిష్ఠానం, స్థానిక నాయకత్వం సముచిత గుర్తింపు ఇస్తుందా..? అనే ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**గడ్డు రోజుల్లో పార్టీని నిలబెట్టిన నేత :** మండలంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో కూడా తీగల రవీందర్ గౌడ్ పార్టీని వీడలేదని కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. నాడు అధికార పార్టీల నుంచి ఒత్తిడులు ఉన్నప్పటికీ, తన స్వంత ఆర్థిక వనరులతో మండలంలో కాంగ్రెస్ కార్యకలాపాలు కొనసాగించి, పార్టీ ఉనికిని కాపాడిన నిఖార్సైన నాయకుడిగా ఆయనకు పేరుంది.

**పదవుల కోసం పార్టీ మారలేదు :** 2001లో తెలుగుదేశం పార్టీ హయాంలో రవీందర్ గౌడ్‌కు ఎంపీపీ పదవి ఆఫర్ వచ్చినప్పటికీ, కాంగ్రెస్ సిద్ధాంతాలపై నమ్మకంతో ఆ అవకాశాన్ని తిరస్కరించారు. రాజకీయ లాభనష్టాల కంటే పార్టీ నిబద్ధతకే ఆయన ప్రాధాన్యం ఇచ్చారని సన్నిహితులు చెబుతున్నారు.

**తీగల వీరలక్ష్మికి అవకాశం కల్పించాలి:** కార్యకర్తల డిమాండ్

దివంగత తీగల రవీందర్ గౌడ్ సేవలకు గుర్తింపుగా ఆయన సతీమణి, సీనియర్ మహిళా నాయకురాలు తీగల వీరలక్ష్మికి చింతలపల్లి సహకార సంఘం చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు గట్టిగా కోరుతు న్నారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కీలక పదవులు లభిస్తున్న తరుణంలో... దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న వీరవిధేయ కుటుంబానికి ఈసారి తప్పక న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**మంత్రి కొండా సురేఖ కుటుంబంతో సన్నిహిత బంధం :** తీగల రవీందర్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, కొండా మురళి దంపతులతో దశాబ్దాలుగా అత్యంత సన్నిహిత అనుబంధం, నమ్మకమైన అనుచరుడిగా గుర్తింపు ఉంది. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఇలాంటి కుటుంబానికి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తే, నియోజకవర్గంలో పాత కాపులకు, కష్టపడే కార్యకర్తలకు మంచి భరోసా ఇచ్చినట్లు అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్ణయంపైనే అందరి దృష్టి :** చింతలపల్లి సొసైటీ చైర్మన్ ఎంపికలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, అలాగే పార్టీ ఉన్నత నాయకత్వం నిర్ణయం అత్యంత కీలకం కానుంది. క్షేత్రస్థాయి సమీకరణాలను పరిశీలించి, పార్టీ నమ్ముకున్న వీరలక్ష్మికి అవకాశం కల్పిస్తారా? లేక ప్రత్యామ్నాయ వ్యూహాన్ని ఎంచుకుంటారా? అనేది నియోజకవర్గంలో సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ సేవకు ఈసారి తగిన ప్రతిఫలం దక్కుతుందో లేదో చూడాలి.

## బేటీ బచావో-బేటీ పడావోపై

# కేజీబీవీలో అవగాహన సదస్సు







**పర్వతగిరి, జూలై 16 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్, సూపర్వైజర్ రమాదేవి హాజరై విద్యార్థినులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006, పోక్సో చట్టం 2012, మహిళలపై కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, సైబర్ నేరాల నివారణ, మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవల గురించి వివరించారు. అలాగే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడం, లింగ వివక్షను రూపుమాపడం, ప్రతి బాలికకు నాణ్యమైన విద్య, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఏదైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు బాలికల భద్రత, సాధికారతపై చైతన్యం కల్పించింది.

## గ్రామ పంచాయతీలు నిద్ర వీడేదెప్పుడు..

# పందుల బెడద తీరేదెప్పుడు..!

- రాత్రి పగలు తేడా లేకుండా వీధుల్లో స్వైరవిహారం - అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన
- పట్టించుకోని అధికారులు, స్థానిక పంచాయతీలు





**సంగెం, జూలై 16 (ప్రజాజ్యోతి) :** సంగెం మండలంలోని పలు గ్రామాల్లో పందుల బెడద రోజురోజుకూ మితిమీరిపోతోంది. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పందులు గుంపులు గుంపులుగా తిరుగుతూ స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

రాత్రి, పగలు తేడా లేకుండా వీధుల్లో స్వైరవిహారం చేస్తుండటంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

**అపరిశుభ్రత..వ్యాధుల భయం :** గ్రామాల్లోని డ్రైనేజీ కాల్వలు, చెత్తకుప్పలే స్థావరాలుగా పందులు సంచరిస్తున్నాయి. కాల్వల్లోని పూడికను రోడ్ల పైకి లాగుతుండటంతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ అపరిశుభ్ర వాతావరణం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**వాహనదారులకు ప్రమాదాలు :** వీధుల్లో, ప్రధాన రహదారులపై పందులు అకస్మాత్తుగా అడ్డం రావడంతో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. పంట పొలాల్లోకి కూడా చొరబడి చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం :** పందుల సమస్యపై స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు, పాలకవర్గాలకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పందుల యజమానులను పిలిపించి హెచ్చరించడంలో కానీ, వాటిని గ్రామాల నుండి తరలించడంలో కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**తక్షణమే చర్యలు చేపట్టాలి :** మండలంలోని అన్ని గ్రామాల్లో పందుల నివారణకు అధికారులు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ సిబ్బందితో నిరంతరం పారిశుధ్య పనులు చేయిస్తూ, పందుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామాలను అంటు వ్యాధుల బారి నుండి కాపాడాలని సంగెం మండల ప్రజలు కోరుతున్నారు.

## మండలానికి మధ్యాహ్నం నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

పలిమేల మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి



**పలిమేల జులై 16 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండలంలో మధ్యాహ్నం మహాదేవపూర్ నుండి ఎటురునాగారం నడిచే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ఆర్టీసీ డిపో మేనేజర్ కు గురువారం రోజున వినతి పత్రం అందించారు. మండలంలో మధ్యాహ్నం మహాదేవపూర్ నుండి ఎటురునాగారం బస్సు సర్వీస్ లేక మండల ప్రజలకు మరియు ఉద్యోగులకు జరిగే ఇబ్బందుల గురించి కూలంకుషంగా చర్చిస్తూ ఉదయం మరియు సాయంకాలం పలిమెల వరకు నూతన బస్ సర్వీసును ప్రారంభించాలని మరియు భూపాలపల్లి నుండి తుపాకులగూడెం మరియు భూపాలపల్లి నుండి ఎటునాగారం వెళ్లే బస్సు సర్వీసులను పలిమెల మండల కేంద్రం గుండా బస్ సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని పలిమెల మాజీ (సర్పంచ్) మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి తెలంగాణ ఆర్టీసీ భూపాలపల్లి డిపో మేనేజర్ మురళీకృష్ణను కలిసి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడపల్లి సర్పంచ్ మోతే సాంబయ్య, మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బుర్రి శివరాజ్ మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్న పర్వతగిరి ప్రజలు..

ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**పర్వతగిరి, జూలై 16 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలో వీధి కుక్కల సంచారం రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, కాలనీలు, పాఠశాలల పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు పాదచారులు, చిన్నారులు, వృద్ధులను భయాందోళనకు గురిచేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులను వెంటాడడం, ఒక్కసారిగా రోడ్డుపైకి రావడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఉదయం నడకకు వెళ్లే వారు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత గ్రామ పంచాయతీ, పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని మండల కేంద్ర ప్రజలు కోరుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేదా కుక్కల దాడులు జరిగేలోపే ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విజ్ఞాన భారతి విద్యార్థుల ఎంపిక



**పర్వతగిరి, జూలై 16 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామంలోని విజ్ఞాన భారతి విద్యాలయం విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 15న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి సిరబోయిన రామ్ చరణ్ అండర్-18 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో, దొణికెన వర్షిత్ అండర్-16 విభాగంలో 2000 మీటర్ల పరుగు పందెంలో అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అక్కినపెల్లి సతీష్ కుమార్ తెలిపారు. ఈ నెల 18న మెదక్ జిల్లా ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో వీరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు రామ్ చరణ్, వర్షిత్‌లను, వారికి శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ భూక్యా సురేష్ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్జద్ పాషా, అశోక్, రజిత, సరిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.


## ఉచిత దుస్తుల పంపిణీ



**చిట్యాల (ప్రజాజ్యోతి) జూలై 16 :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గురువారం విద్యార్థిను లకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రైనీ కలెక్టర్ నవీన్ రెడ్డి హాజరై విద్యార్థినులకు ఉచిత దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వసంతరావు, ఎంపీడీవో జయశ్రీ, ఎంఈఓ రఘుపతి, పాఠశాల ప్రత్యేక అధికారి సుమలత, ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థినులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలి

- ఎస్ఐఆర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాముల పరిశీలన
- మాజీ ఎంపీటీసీ కంది ప్రభాకర్



**రాయపర్తి జులై 16 ప్రజా జ్యోతి :** రాయపర్తి మండలం రాగన్న గూడెం గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా గురువారం బిఎల్ఓతో కలిసి ఎన్యూమరేషన్ ఫార్మ్‌ల నింపే ప్రక్రియలో భాగస్వామ్యం అయి ఓటర్‌లకు అవగాహనా కల్పించిన మాజీ ఎంపీటీసీ కంది ప్రభాకర్, కాంటెస్ట్ సర్పంచ్ సూధం రజిత- మహేందర్, గ్రామ మాజీ పార్టీ అధ్యక్షులు సరికొండ రాజు రెడ్డి, బూత్ కన్వీనర్ రెంటాల రాజు రెడ్డి, బాలగాని రాంబాబు, పార్టీ ముఖ్య నాయకులు సూధం కిషన్, సరికొండ యాకూబ్ రెడ్డి, కోల యాకయ్య, పోగులకొండ మల్లయ్య, మరకల నారాయణ రెడ్డి,గోపూ పద్మ, తదితరులు పాల్గొని ఈ సందర్భంగా ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని, అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫార్మ్‌ను పూర్తి చేసి బిఎల్ఓకు అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### జూలై 20న జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి

### భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గౌరిగే సోములు

రామన్నపేట జులై 16 (ప్రజాజ్యోతి)

భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన భువనగిరి కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహించే మహా ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం




(సీఐటీయు) యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిగే సోములు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విరమించి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.జి.ఓ. నెం. 12ను వెంటనే రద్దు చేయాలి.సీ.ఎస్.సి. హెల్త్ సెంటర్ విధానాన్ని రద్దు చేయాలి.పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిములను వెంటనే పరిష్కరించి చెల్లించాలి.సహజ మరణం, ప్రమాద మరణం బీమా పరిహారాన్ని సంక్షేమ బోర్డు ద్వారానే చెల్లించాలి. కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి.ఈ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న మహా ధర్నాలో జిల్లా నలుమూలల నుంచి భవన నిర్మాణ కార్మికులు, నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గౌరిగే సోములు కోరారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బుడ్డ ప్రసాద్,వంగాల మారయ్య,సీఐటీయు జిల్లా కమిటీ సభ్యుడు అప్పం సురేందర్, నాయకులు గోల్లూరి నాగరాజు, గౌరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కే కే కమిటీకి ఉద్యమకారులు హాజరు కావాలి

రామన్నపేట జులై 16 ( ప్రజా జ్యోతి):

ఉద్యమ కారుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కే కే కమిటీకి రేపు అనగా తేదీ 17 న హైదరాబాద్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా లోని ఉద్యమకారులు హాజరు కావాలని ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్



చాంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న, జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగయ్య నోముల శంకర్ లు కోరారు. రేపు హైదరాబాద్ లో సెక్రటేరియట్ ముందు గల అమర జ్యోతి భవనంలో ఉమ్మడి వరంగల్ ,కమ్మం ,నల్లగొండ జిల్లాలకు సంబంధించిన ఉద్యమ కారులతో కే కే కమిటీ బృందం సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. కమిటీకి మన సలహాలు ,సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. మన ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

# విధుల నిర్లక్ష్యానికి మూల్యం..

### బండ రామారం ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ సస్పెండ్

తుంగతుర్తి, జులై 16,(ప్రజా జ్యోతి):

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పాఠశాల మూసివేతకు కారణమైన జిల్లా పరిషత్ బండ రామారం పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎంఏ హకీమ్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ గురువారం ఉత్తర్వులను అందజేశారు. గత సంవత్సరం జిల్లా పరిషత్ పాఠశాలలో 13 మంది విద్యార్థులు ఉండగా సంబంధిత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు విధులు మరిచి ఉన్నతాధికారుల ఆదేశం లేకుండానే అట్టి విద్యార్థులకు టిసీలు ఇచ్చి పంపియడంతో పాఠశాల విద్యార్థిలు లేక మూతబడింది.దీంతో గత మూడు రోజుల క్రితం జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులను విచారించారు.మిగతా పాఠశాలలో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు అందజేశారు.

# కలెక్టర్‌ను సత్కరించిన చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం

భూదాన్ పోచంపల్లి, జూలై 16 (ప్రజాజ్యోతి):

ఇటీవల ఎన్నికైన పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాదపూ




ర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు భారత్ లవ్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అందించాలని కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నూతన కార్యవర్గానికి కలెక్టర్ అనురాగ్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, చేనేత అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వెంటనే ఏకరూప దుస్తులు అందించాలి

### మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

రామన్నపేట జూలై 16 (ప్రజా జ్యోతి):

పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివ



రకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫారాలు) అందించకపోవడం అత్యంత నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇస్కిల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతర గతి కుటుంబాల పిల్లలకు సమయానికి యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, ఇతర అవసరమైన సామగ్రిని అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రెండు నెలలు పూర్తవుతున్నా విద్యార్థులకు యూనిఫారాలు అందకపోవడం వల్ల తల్లిదండ్రులు ఆర్థిక భారం మోయాల్సి వస్తోందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందేలా మెనూను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, పప్పు, పాలు వంటి పోషకాహార పదార్థాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అందించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,వ్యకాస నాయకులు బల్గురి అంజయ్య,రైతు సంఘం మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ గన్నేబోయిన విజయభాస్కర్, సీఐటీయు



మండల కార్యదర్శి గౌరిగే సోములు నాయకులు గంటెపాక శివ కుమార్,మేడబోయిన శ్రీనివాస్,నీల ఐలయ్య,అప్పం సురేందర్, పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నార్కట్ పల్లి, జూలై 16 ( ప్రజా జ్యోతి):

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలంలోని దోకూరి గార్డెన్ ఫంక్షన్ హాల్లోగురువారం 102 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి & షాది ముబారక్ చెక్కులను ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పంపిణీ



చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ... పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు హార్దిక భరోసా కల్పించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ నకిరేకల్ నియోజకవర్గంలో రహదారులు, విద్య, వైద్యం, త్రాగునీరు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తూ, ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వేణుగోపాలరావు, మాజీ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య, సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గాయం శ్యాంసుందర్ రెడ్డి, సట్టు సత్తయ్య, శివ, వడ్డే భూపాల్ రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

# శరణుఘోషల మధ్య వైభవంగా అయ్యప్ప స్వామి 21వ ప్రతిష్ఠ మహోత్సవం

భూదాన్ పోచంపల్లి, జూలై 16 (ప్రజాజ్యోతి):

శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో 21వ ప్రతిష్ఠ




వార్షికోత్సవ మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమైన ఉత్సవాల్లో మహాగణపతి హోమం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామికి సర్వాభిషేకం, నవకలశ పూజలు, కలశాభిషేకం, సహస్ర నామార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశిష్ట అతిథిగా పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ నిర్మాణానికి విరాళాలు అందించిన దాతలను ట్రస్ట్ అధ్యక్షుడు రాపోలు రామచంద్రం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లను కూడా ట్రస్ట్ సభ్యులు శాలువాతో సత్కరించారు.



ట్రస్ట్ అధ్యక్షుడు రాపోలు జ్ఞానేశ్వర్, వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు రామచంద్రం, ప్రధాన కార్యదర్శి ఎన్. శివకుమార్, కోశాధికారి చిలువేరు బాలనరసింహ, జెల్ల వెంకటేష్, భారత్ లవ కుమార్, గురుస్వాములు, మహిళా భక్తులు, దేవాలయ ధర్మకర్తలు మరియు భగవద్బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తదుపరి భక్తులకు తీర్థప్రసాదాలు, మహాప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్త సమాజం

# పుట్టినరోజున సేవా స్ఫూర్తి చాటిన ఉపాధ్యాయుడు

### పాఠశాలకు జాతీయ నాయకులు, మహనీయుల చిత్రపటాల విరాళం

### విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక విలువలు పెంపొందించడమే లక్ష్యం

నాగారం జూలై 16 ప్రజా జ్యోతి:

పుట్టినరోజును సేవా కార్యక్రమంతో జరుపుకుంటూ ఆదర్శంగా నిలిచారు పసునూరు తెలంగాణ ఆదర్శ పాఠశాల తెలుగు భాష ఉపాధ్యాయుడు కాటమల్ల సోమసుందర్. నాగారం మండల పరిధిలోని పసునూరు తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, మహనీయుల జీవితాల పట్ల అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఆయన తన పుట్టినరోజు సందర్భంగా జాతీయ నాయకులు, మహనీయులు, సంఘ సంస్కర్తల చిత్రపటాలను పాఠశాలకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేముల బాలరాజు మాట్లాడుతూ, పుట్టినరోజును సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆదర్శప్రాయమని, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే మహనీయుల చిత్రపటాలను అందించడం అభినందనీయమని అన్నారు. తెలుగు భాష ఉపాధ్యాయుడు కాటమల్ల సోమసుందర్ మాట్లాడుతూ, విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ చిత్రపటాలు విద్యార్థుల్లో జాతీయ భావన, క్రమశిక్షణ, సామాజిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సోమసుందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన సేవాభావాన్ని కొనియాడారు.



# నకిలీ డీఏపీ విక్రయాలపై నిఘా పెంచాలి

### –డి ఏ ఓ శ్రీధర్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన జనిగ సందీప్

హుజూర్ నగర్ జూలై 16 (ప్రజా జ్యోతి):

నకిలీ డీఏపీ ఎరువుల ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జనిగ సందీప్ సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ)



శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రాంతాల్లో నకిలీ డీఏపీ బస్తాల విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జిల్లాలో ముఖ్యంగా మఠంపల్లి మండలంతో పాటు హుజూర్‌నగర్ పట్టణంలో కూడా కొందరు ఎరువుల వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా డీఏపీ బస్తాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు.రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ ఎరువులు విక్రయించే వారిపై వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఓటర్ల సమగ్ర జాబితాను పూర్తి చేయాలి

### 8వ వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను ఉపేందర్

హుజూర్ నగర్ జూలై 16 (ప్రజా జ్యోతి):

పట్టణంలోని గోవిందపురం 8వ వార్డు బూత్ నెంబర్ 223 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ ప్రోగ్రాంను విజయవంతం చేస్తున్నట్లు 8 వ వార్డ్ కౌన్సిలర్ కోలా ఉదయభాను



ఉపేందర్ తెలిపారు.బిఎల్ఓ శాంతమ్మ తో కలిసి సర్ ప్రోగ్రాం జాబితను పరిశీలించి మాట్లాడారు. అర్హులైన వారి ఓట్లను జాబితాలో ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఒక ఓటు కూడా మిస్ కాకుండా జాబితాలో ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎనిమిదో వార్డులో మొత్తం ఓట్లు 1000 సంబంధించి 630 పూర్తయినట్లు అయినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కె. నాగేశ్వరరావు, జి.రాములు, కొత్తపల్లి నాగమణి, హేమంతా, బండారు వెంకటరమణ నందిని, నరసింహారావు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి

రామన్నపేట, జులై 16 (ప్రజా జ్యోతి):

విద్యార్థులు ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జీవో



నెంబర్ను ను ఆర్తోరాయాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాల భువనగిరి రోడ్డుపై విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోది రాందేవ్ మాట్లాడుతూ 10వేల కోట్ల స్కాలర్షిప్స్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు పల్లపు దుర్గయ్య, టీఎస్ఎస్ఏ ఊరేళ్ల మహేష్, ఎడ్ల మహాలింగం, జిసుకల కృష్ణ, సురేష్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అర్టిసన్ల హక్కుల కోసం 22న మహా ధర్నా

● మహా ధర్నా విజయవంతానికి సమాయత్తం కావాలి


● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ ● 82 సాయిలు, జేఏసీ అందోల్ డివిజన్ అధ్యక్షుడు రంజిత్



**అందోల్, (ప్రజాజ్యోతి):** తెలంగాణ విద్యుత్ అర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఎఇ-జెఎసి) ఆధ్వర్యంలో ఈ నెల 22న హైదరాబాద్‌లోని 'టిజిఎస్పిడిసిఎల్' కార్పొరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాను ప్రతి విద్యుత్ అర్టిసన్ ఉద్యోగి విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్--82 సాయిలు, జేఏసీ అందోల్ డివిజన్ అధ్యక్షుడు రంజిత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహా ధర్నాకు సంబంధించి విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, ఇంధన శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రివర్యులకు గురువారం అధికారికంగా ధర్నా నోటీసు అందజేసినట్లు తెలిపారు. ఇది ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమమని పేర్కొన్నారు. విద్యుత్ అర్టిసన్ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సేవా సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, డివిజన్లు, సెక్షన్ల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని, జూలై 22 మహా ధర్నా ఉద్యమానికి కీలక మలుపు కావాలని సాయిలు, రంజిత్ ఆకాంక్షించారు.

# ఫార్మాస్యూటికల్ పరిశోధనలో గీతం విద్యార్థికి పీహెచ్‌డీ

● దీర్ఘకాలిక వాపు వ్యాధుల చికిత్సకు వినూత్న ఔషధ రూపాల అభివృద్ధిపై అధ్యయనం




**పటాన్ చెరు (ప్రజాజ్యోతి)** దీర్ఘకాలిక వాపు (క్రానిక్ ఇన్‌ఫ్లమేటరీ) సంబంధిత వ్యాధుల చికిత్సలో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేసే పరిశోధన చేపట్టిన గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి శ్రీధరాల వి. నూకరాజుకు పీహెచ్‌డీ పట్టా లభించింది. ఆయన సమర్పించిన సిద్ధాంత వ్యాసాన్ని విశ్వవిద్యాలయం ఆమోదించడంతో డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం, వాహకం ద్వారా పనిచేసే వినూత్న స్థానిక (టాపికల్) టెరిఫ్లునోమైడ్ ఔషధ రూపాల అభివృద్ధి' అనే అంశంపై నూకరాజు పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ అధ్యాపకుడు డాక్టర్ పవన్ కుమార్ మార్గదర్శకత్వం వహించారు. ఈ పరిశోధనలో ప్రధానంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, అటోపిక్ డెర్మటైటిస్ వంటి దీర్ఘకాలిక వాపు వ్యాధుల చికిత్స కోసం టెరిఫ్లునోమైడ్ ఔషధాన్ని నేరుగా ప్రభావిత భాగానికి చేరేలా వినూత్న టాపికల్ ఫార్ములేషన్లను అభివృద్ధి చేశారు. దీనివల్ల ఔషధం శరీరమంతా వ్యాపించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించడంతో పాటు, లక్షిత చికిత్సను మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉందని పరిశోధనలో వెల్లడైంది. ఈ అధ్యయనం ద్వారా సురక్షితమైన, రోగికి అనుకూలమైన, వ్యాధి-నిర్దిష్ట స్థానిక ఔషధ రూపాలను విజయవంతంగా రూపొందించినట్లు పరిశోధకులు పేర్కొన్నారు. భవిష్యత్‌లో క్లినికల్ పరీక్షలు, వాణిజ్యీకరణకు ఈ పరిశోధన బలమైన పునాదిగా నిలవడంతో పాటు, స్థానిక ఔషధ పంపిణీ (లోకల్ డ్రగ్ డెలివరీ) రంగంలో కీలకమైన ముందడుగుగా ఉపయోగపడుతుందని తెలిపారు. నూకరాజు పీహెచ్‌డీ సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శివకుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ పరిశోధన ఫార్మాస్యూటికల్ శాస్త్ర పరిశోధనలకు మరింత ఊతమివ్వడంతో పాటు, భవిష్యత్‌లో రోగులకు మెరుగైన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# అందోల్ నియోజకవర్గంలో 67.73 శాతం 'ఎస్ఐఆర్' డిజిటలైజేషన్ పూర్తి

● వట్‌పల్లి ముందంజ.. అల్లాదుర్గ్ చివరి స్థానంలో

● మరో 82,318 ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పెండింగ్



08.00 PM Report 15.07.2026 36-Andole(SC) A/C

| Sl No | Mandal | Total Elector | Total EFs Distributed | Total EFs Digitized | Balance Digitalisation | % EFs Digitization |
|---|---|---|---|---|---|---|
| 1 | Alladurg | 23668 | 23668 | 14718 | 8950 | 62.19 |
| 2 | Andole | 48272 | 48272 | 32715 | 15557 | 67.77 |
| 3 | Chowtakur | 17826 | 17826 | 12215 | 5611 | 68.52 |
| 4 | Munipally | 34232 | 34232 | 23169 | 11063 | 67.68 |
| 5 | Pulkal | 23573 | 23573 | 15816 | 7757 | 67.09 |
| 6 | Raikode | 33871 | 33871 | 23662 | 10209 | 69.86 |
| 7 | Regode | 18818 | 18818 | 12628 | 6190 | 67.11 |
| 8 | Tekmal | 29016 | 29016 | 19317 | 9699 | 66.57 |
| 9 | Vatpally | 25808 | 25808 | 18526 | 7282 | 71.78 |
| | Total | 255084 | 255084 | 172766 | 82318 | 67.73 |

**అందోల్, (ప్రజాజ్యోతి):** అందోల్ శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. జూలై 15 రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉన్న నివేదిక ప్రకారం మొత్తం 2,55,084 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, అందులో 1,72,766 ఫారాలు డిజిటలైజేషన్ పూర్తి చేసి 67.73 శాతం పురోగతి సాధించారు. మరో 82,318 ఫారాల డిజిటలైజేషన్ పెండింగ్‌లో ఉంది. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో వట్‌పల్లి మండలం 71.78 శాతం డిజిటలైజేషన్‌తో మొదటి స్థానంలో నిలవగా, రాయికోడ్ 69.86 శాతం, చౌటకూర్ 68.52 శాతం, మునిపల్లి 67.68 శాతం, అందోల్ 67.77 శాతం, పుల్కల్ 67.09 శాతం, రేగోడ్ 67.11 శాతం, టేక్మాల్ 66.57 శాతం పురోగతి నమోదు చేశాయి. అల్లాదుర్గ్ మండలం 62.19 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. మొత్తం ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్న అందోల్ మండలంలో 48,272 ఫారాలు పంపిణీ చేయగా, 32,715 ఫారాలు డిజిటలైజేషన్ పూర్తి కాగా, 15,557 ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే మునిపల్లి మండలంలో 11,063, రాయికోడ్‌లో 10,209, టేక్మాల్‌లో 9,699 ఫారాల డిజిటలైజేషన్ ఇంకా పూర్తి కావాల్సి ఉంది. మిగిలిన గడువులో పెండింగ్‌లో ఉన్న ఫారాలను త్వరితగతిన డిజిటలైజేషన్ పూర్తి చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా ముగించేందుకు ఎన్నికల యంత్రాంగం చర్యలు వేగవంతం చేసింది. మండలాల వారీగా బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందని అందోల్ ఆర్డీవో కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

# దాతల విరాళాలతో తెర్పోల్ గ్రామంలో అభివృద్ధి

● ప్రచారం మాత్రం సొంత నిధులపేరెందుకు? ● తెర్పోల్ గ్రామాభివృద్ధి పేరిట ప్రచార ఆర్భాటంపై విమర్శలు




**కొండాపూర్ ప్రజాజ్యోతి** మండలంలోని తెర్పోలు పంచాయతీ పరిధిలో గ్రామాభివృద్ధి పనుల నిర్వహణ, వాటిపై జరుగుతున్న ప్రచారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమలు, వెంచర్లు ఏర్పడిన నేపథ్యంలో ఆ గ్రామంలో ఇతర ప్రాంతాల వారు భారీగా వ్యవసాయ భూములు కొనుగోలు చేయడంతో, గ్రామాభివృద్ధి కోసం పలువురు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నట్లు సమాచారం. విరాళాలతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధి తన సొంత నిధులతో చేపడుతున్న పనులుగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, కొన్ని పనులకు ప్రభుత్వ నిధుల ద్వారా బిల్లులు సమర్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై పారదర్శకత అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, తాగునీటి బోర్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు దాతల సహకారంతో జరిగినప్పటికీ, వాటిని వ్యక్తిగత ఖర్చులతో చేపట్టినట్లుగా ప్రచారం చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతంలో ప్రభుత్వ భూమి నుంచి మైనింగ్ అనుమతితో మట్టి తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేసి, అనంతరం గ్రామాభివృద్ధి పేరుతో మైనింగ్ నిర్వాహకులతో ఉచితంగా ఫార్మేషన్ రోడ్లు వేయించుకుని, వాటిని తన సొంత నిధులతో నిర్మించినట్లు ప్రచారం చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు, గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి నుంచి రైతులు తమ పొలాలకు దారులు ఏర్పాటు చేసుకోవడానికి ఇళ్ల నిర్మాణం కోసం మట్టి తీసుకెళ్లాలన్నా తన అనుమతి తప్పనిసరి అని ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది అధికారిక విధానాలకు విరుద్ధమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో "ప్రభుత్వ నిధులు వచ్చినా రాకపోయినా సొంతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తాను" అని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధి, ప్రస్తుతం దాతల విరాళాలతో జరుగుతున్న పనులను వ్యక్తిగతంగా చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. "ప్రభుత్వ నిధులు, దాతల విరాళాలతో గ్రామాభివృద్ధి చేయడం తప్పు కాదు. ఇతరుల సహకారంతో జరిగిన పనులను సొంత నిధులతో చేసినట్లు ప్రచారం చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే" అని పలువురు గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. గ్రామాభివృద్ధికి వచ్చిన ప్రతి రూపాయి ఖర్చుపై పూర్తి పారదర్శకత పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇంటింటికీ రెండు చెత్త బుట్టలు
# చౌటకూర్‌లో స్వచ్ఛతకు కొత్త అడుగు

● చెత్త వేరు చేస్తేనే పరిశుభ్రమైన గ్రామం సాధ్యం

● సర్పంచ్ పార్కల రాంరెడ్డి



**అందోల్, (ప్రజాజ్యోతి):** గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చౌటకూర్ గ్రామపంచాయతీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ ఇంటికి రెండు చొప్పున చెత్త బుట్టలను పంపిణీ చేస్తూ, తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పార్కల రాంరెడ్డి ప్రారంభించి గ్రామస్తులకు చెత్త బుట్టలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణను శాస్త్రీయంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతో పాటు గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగుపడతాయన్నారు. పరిశుభ్రమైన గ్రామ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి కుటుంబం చెత్తను నిర్దేశిత పద్ధతిలో అందించడం ద్వారా స్వచ్ఛ గ్రామం--ఆరోగ్య గ్రామం లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలకు గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కలాలి రామగౌడ్, గ్రామ అధ్యక్షుడు వర్కల రమేష్, నాయకులు మల్లికార్జున్ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, వార్డు సభ్యులు హరీష్ బాల్జ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త భవనాలకు పాత బేస్‌మెంట్ రాయితో భవన నిర్మాణం

● మహిళా సంఘాల భవనాల నిర్మాణాలపై నాణ్యత లోపం

● తెర్పోల్‌లో పాత మెటీరియల్ వినియోగంపై ఆరోపణలు





**కొండాపూర్ ప్రజా జ్యోతి** ప్రభుత్వం మహిళల సాధికారత కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో నిర్మిస్తున్న డ్వాక్రా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనుల్లో పాత మెటీరియల్ వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని స్కూల్ వద్ద తొలగించిన పాత బేస్‌మెంట్ రాళ్లను కొత్తగా నిర్మిస్తున్న మహిళా శక్తి భవనాలకు ఉపయోగిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న కొత్త నిర్మాణాల్లో నాణ్యమైన, నిబంధనలకు అనుగుణమైన నిర్మాణ సామగ్రి వినియోగించాల్సి ఉండగా, పాత రాళ్లను వినియోగించడం ఎంతవరకు సమంజసమని వారు నిలదీస్తున్నారు. తెర్పోల్ గ్రామంలోనే కాకుండా మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కొత్త ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో పాత మెటీరియల్ వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని సమాచారం. దీంతో నిర్మాణాల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై సంబంధిత ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, నిర్మాణ పనులను పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న భవనాలు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జిన్నారం పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

● రికార్డుల నిర్వహణ సంతృప్తికరం

● నాణ్యమైన దర్యాప్తుతో ప్రజల విశ్వాసం పెంచాలి





**జిన్నారం(ప్రజాజ్యోతి) జూలై 16** నాణ్యమైన దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణ ద్వారానే పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం జిన్నారం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు కీలక సూచనలు చేశారు. తనిఖీల సందర్భంగా జిన్నారం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన ఎస్పీ, పటాన్‌చెరువు డీఎస్పీ ప్రభాకర్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, సిబ్బందికి అందజేసిన కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. ప్రభుత్వ సామగ్రిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో కేసులకు సంబంధించిన స్వాధీన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, క్రైమ్ కేసుల వాహనాలను సకాలంలో కోర్టులకు అప్పగించాలని, అన్‌క్లెయిమ్డ్ వాహనాలను నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. ప్రతి కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని రికార్డులను సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేసి, పెండింగ్ లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం పెంచుకుని శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. రౌడీ షీటర్ లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు పగలు, రాత్రి బీట్‌లను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. జిన్నారం ప్రాంతంలో పరిశ్రమలు అధికంగా ఉండటంతో వలస కార్మికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, దీంతో ఆస్తి సంబంధిత నేరాల అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. అలాంటి ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, బ్లాక్‌స్పాట్ లో పహారా బలోపేతం చేయాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పేర్కొంటూ, ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ, గ్రేవ్ కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, రికార్డులు పెండింగ్‌లో లేకుండా పర్యవేక్షించాలని సీఐలకు ఆదేశించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, యువ కానిస్టేబుళ్లు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో స్టేషన్ రైటర్లుగా ఎదగాలని సూచించారు. సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ తదితర సాంకేతిక వ్యవస్థలపై పూర్తి పట్టు సాధించి నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని ప్రశంసించిన ఎస్పీ, ఇదే పనితీరును కొనసాగిస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో పటాన్‌చెరువు డీఎస్పీ ప్రభాకర్, జిన్నారం సీఐ పి. రమణారెడ్డి, ఎస్‌హెచ్‌ఓ హనుమంతు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థుల సమస్యలపై
# ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి పర్యటన

● రేపు ఆందోల్ కస్తూర్బా పాఠశాల సందర్శన ● బీజేపీ శ్రేణులు హాజరు కావాలని పిలుపు



**అందోల్, (ప్రజాజ్యోతి):** వట్‌పల్లి, ఆందోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు బీజేపీ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి ఈ నెల 17న ఉదయం 8 గంటలకు ఆందోల్ కస్తూర్బా పాఠశాలను సందర్శించనున్నట్లు సంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకట నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పాఠశాలలోని వసతులు, విద్యా పరిస్థితులను పరిశీలించనున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆందోల్ అసెంబ్లీ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 8 గంటలకల్లా కస్తూర్బా పాఠశాల వద్దకు చేరుకుని పాల్గొనాలని ఆయన కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

# బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు పెట్టిన అక్రమ

● కేసులో జహీరాబాద్ కోర్టుకు హాజరైనా బిఆర్ఎస్ నాయకులు



**జహీరాబాద్, జూలై 16 ( ప్రజా జ్యోతి న్యూస్ )** నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ సీనియర్ నాయకులు నామా రవి కిరణ్, కొమారి జగదీష్ ఆనందం, ఎర్రోళ్ల శివప్ప, రాథోడ్ భీం రావ్ హీరు రాథోడ్ లు జహీరాబాద్ పట్టణంలోని కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 19.07.2025 నాడు సెట్విన్ సంస్థకు సంబంధించిన అధికారిక కార్యక్రమం నిర్వహించి స్టేజి బ్యానరులో దళిత ఎంఎల్ఏ అయిన జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు ఫోటో ఎందుకు వేయలేదు అని ప్రోటోకాల్ పాటించడం లేదని కార్యక్రమం అయిపోయిన తర్వాత అక్కడి అధికారులను అడిగి నిరసన వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. ఇదే విషయాన్ని అదునుగా భావించి కాంగ్రెస్ నాయకులు పోలీసుల పై ఒత్తిడి చేయించి మాపై బలవంతంగా కేసులు పెట్టించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోర్టులో బెయిల్ తీసు కోవడం జరిగిందని న్యాయ వ్యవస్థ పై మాకు పూర్తి విశ్వాసం ఉందని తప్పకుండ చివరకు న్యాయమే గెలుస్తుందని వారు తెలిపారు. కౌన్సిలర్లు మహిపాల్ ,అబ్దుల్లా , శ్రీనివాస్, గోవింద్ రాథోడ్,బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫార్మ్స్‌ను సంబంధిత
# అధికారులకు అందజేసిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు



**జహీరాబాద్, జూలై 16 (ప్రజాజ్యోతి న్యూస్)** ఝరసంఘం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు తమ కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి ఎస్ఐఆర్ ఫార్మ్స్‌ను సంబంధిత అధికారులకు అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పారదర్శకంగా, వేగవంతంగా ఎస్ఐఆర్ ఫార్మ్స్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఓటర్లందరూ తమ వివరాలను తప్పని సరిగా నమోదు చేసి, సంబంధిత బి ఎల్ఏ ల్లు లేదా అధికారు. లకు వీలైనంత త్వరగా ఎస్ఐఆర్ ఫార్మ్స్‌ను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజి సర్పంచ్ ఫోరం అధ్యక్షులు జగదీష్, గ్రామ సర్పంచ్ వినోద బాల్ రాజ్ వివిధ గ్రామాల సర్పంచ్ లు రాజు, శివమణి, రాజ్ కుమార్, నాగేందర్, సోహైల్, నాయకులు వెంకట్ రెడ్డి, శశి వర్ధన్ రెడ్డి, బిఎల్ఓ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాన ప్రతినిధ్యం, సమాన హక్కు, దయ కాదు. మహిళా హక్కు

● ప్రధానమంత్రికి పోస్ట్ కార్డ్ ద్వార మా విన్నపం ● మొగుడంపల్లి మండలంలోని మన్నపూర్ గ్రామశీ

● మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్

**జహీరాబాద్, జూలై 16 ( ప్రజాజ్యోతి న్యూస్)** నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లో ఆమోదం పొంది నప్పటికీ, అమలు ఇంకా పెండింగ్ లోనే ఉంది. లక్షలాది మంది మహిళలు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. మహిళలు కేవలం లబ్ధిదారు లుగా కాకుండా, విధాన నిర్ణయాలు తీసుకునే స్థానాలకూ చేరుకోవాలి అన్నారు. సమాన ప్రాతి నిధ్యం కోసం జనాభాలో సగభాగం ప్రజల గళాన్ని వినిపిస్తూ, ప్రధాన మంత్రికి పోస్ట్ కార్డుల ఉద్యమశీ, నిర్వహించడం జరిగింది. రిజర్వేషన్ చట్టంలో ఎస్సీ, ఎస్టీ మహిళలతో పాటు ఓబీసీ మహిళలకు కూడా సమాన వాట తక్షణమే అమలు చేయాలని, ఈ నెల 20 నుండి జరిగే పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని కోరడం జరిగింది. ఈ కారిక్రమంలో మహిళా కాంగ్రెస్ మొగుడం పల్లి మండల అధ్యక్షురాలు మారుని బాయి అధ్వర్యం లో మన్నపూర్ గ్రామంలో నిర్వ హించడం జరిగింది. చున్ను బీ, పద్మమ్మ, తుల్జమ్మ, నర్సమ్మ, మంజుల, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



## నాడు కలకల నేడు విలవిల పల్లె ప్రకృతి వనాల పరిస్థితి







**ములుగు, జూలై 11(ప్రజా జ్యోతి)** మండలంలోని ఆయా గ్రామాలలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు పూలతో,పచ్చదనంతో ఎంతో ఆహ్లాదకరంగా ముచ్చట కొలిపేవి,నాడు కళకళలాడిన పల్లె ప్రకృతి వనాలు నేడు వెలవెలబోతున్నాయి,పూల మొక్కలు,ఆరోగ్యానికి ఆయువునిచ్చేచెట్లు నీరు లేక ఎండిపోయి చెత్త చెదారంతో నిండిపోయాయి.పంచాయతీ సెక్రటరీలు పల్లె ప్రకృతి వనము వైపే చూడడమే మర్చిపోయారు,దీంతో ఆదరణ కరువై నేడు వెలవెలబోతున్నాయి.గత ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిధుల కొరతో,అధికారుల నిర్లక్ష్యం వల్లనో తెలియదు కానీ పల్లె ప్రకృతి వనాలు మాత్రం నీరు లేక కన్నీరు పెడుతున్నాయి, నూతనంగా ఎన్నికైన సర్పంచులు కానీ, ప్రభుత్వ ప్రతినిధులైన పంచాయతీ సెక్రటరీలు ఇకనైనా పల్లె ప్రకృతి వనాలపై దృష్టి పెట్టి పచ్చదనంతో రకరకాల పూలతో అహల్లాదపరిచే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## పని ఒత్తిడిలో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించొద్దు

**- వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ హైమావతి**







**సిద్దిపేట అర్బన్, జూలై 16 (ప్రజాజ్యోతి):-** పని వత్తిడిలో పడి ఆరోగ్యం పట్ల అశ్రద్ద వహించకుండా తగిన జాగ్రత్త లు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులో జిల్లా మహిళా సమాఖ్య భవనంలో జిల్లా సెర్ప్ , ఎస్ఆర్ డిఎస్ సిబ్బందికి ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టిపిఏ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సెర్ప్, ఎస్ ఆర్ డి ఎస్ సిబ్బందికి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా పనులలో బిజీ షెడ్యూల్లో ఉండి తరచూ క్షేత్రస్థాయిలో తిరగడం మూలంగా విశ్రాంతి లేకుండా తీవ్ర పని ఒత్తిడికి గురవుతారని తద్వారా అనారోగ్యానికి గురవుతారని ఈ వైద్య శిబిరంలో పాల్గొని తమ యొక్క ఆరోగ్య స్థితిగతులను పరీక్షించుకోవాలన్నారు. డాక్టర్లు అందించిన మెడిసిన్ సలహాలు, సూచనలు పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని సూచించారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య.రేణుక తదితరులు ఉన్నారు.

## జలసాధన కోసం రైతు మహా పాదయాత్ర

**- గోదావరి జలాలతో ప్రాజెక్టులు నింపాలి**



**సిద్ధిపేట,జులై 16,(ప్రజాజ్యోతి):** గోదావరి జలాలను ప్రాజెక్టులకు మళ్లించి రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించనున్న రైతు మహా పాదయాత్రకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని చిన్నకోడూరు మండల బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు.గురువారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేలేటి రాధాకృష్ణ శర్మ, మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను నింపడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్ వరకు చేపట్టనున్న ఈ పాదయాత్ర రైతుల సాగునీటి హక్కు కోసం నిర్వహిస్తున్న ఉద్యమమని తెలిపారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించి గోదావరి జలాలతో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టులను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రస్తావిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని పేర్కొంటూ, రైతుల ప్రయోజనాల కోసం చేపడుతున్న ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.విలేకరుల సమావేశంలో పాల సాయిరాం, సదానందం గౌడ్, ఉమేష్, జంగిటి శ్రీనివాస్, వెంకటేశం, రవీందర్ రెడ్డి, కీసరి పాపయ్య, కాల్వ ఎల్లయ్య, మధుసూదన్ రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు అమ్మితే ఊరుకునేది లేదు

**- కావాలనే ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారు - డీఏపీ రూ.1350 కే విక్రయించాలి**

**- వంగరాజేశ్వర్ రెడ్డి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు**



**చిన్నకోదూరు, జులై16, (ప్రజాజ్యోతి):-** వ్యాపారులు ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్మితే ఊరుకునేది లేదని వంగ రాజేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఎరువులను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. ప్రభుత్వ నిర్మిత ధరలకే డీఏపీని విక్రయించాల్సి ఉన్న అధిక ధరలకు కావాలని అమ్ముతూ ప్రభుత్వాన్ని కొందరు బద్నాం చేస్తున్నారన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో కొందరు వ్యాపారులు డీఏపి ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎరువుల అధిక ధరల విషయమై వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడా నని తెలిపారు. రూ.1350 కే ఎలాంటి లింకు పెట్టకుండా డిఎపి ఎరువులను అమ్మేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎరువుల ధరలు తెలిసేలా డిస్ప్లే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. దీంతో రైతాంగానికి ఊరట లభించనుందని, రైతుల సంక్షేమం పట్ల రాజేశ్వర్ రెడ్డి చూపిన చొరవ అభినందనీయమంటూ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలి

**- పదవ తరగతి అనేది జీవితానికి ఒక పునాది**

**- సమయం వృధా చేయకుండా విద్యాభ్యాసం చేయాలి - జిల్లా కలెక్టర్ హైమావతి**





**సిద్దిపేట అర్బన్, జులై 16(ప్రజాజ్యోతి):-** ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతి రోజు క్రమం తప్పకుండా చదవాలని, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విద్యార్థులకు సూచించారు.సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె పాఠశాల ప్రాంగణం మొత్తం పరిశీలిస్తూ మైదానంలో చెట్లు ప్రశాంతమైన వాతావరణం బాగుందని ప్రిన్సిపల్ ను అభినందించారు. పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సబ్జెక్ట్స్ తరగతులు అవుతున్నాయా, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడగ్గా అన్ని తరగతులు బాగానే అవుతున్నాయని భోజనం బాగుందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు.గోడపైన రాయించిన తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ టెన్సెస్, గణిత సుత్రాలు, సైన్స్ సుత్రాలను చూపిస్తూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. గోడపైన రాసినవి రోజు చూస్తుంటే వాటిని ఎప్పటికీ మర్చిపోకుండా జ్ఞాపకం ఉంటాయని, రోజు ఒకసారి వాటిని తప్పనిసరిగా చదవాలని తెలిపారు. సమయాన్ని వృధా చేయకుండా క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని, పుస్తక జ్ఞానంతో పాటు రోజు న్యూస్ పేపర్ చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పెండింగ్ లో ఉంచకుండా అదే రోజు చదవాలని, మంచి క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలని, సబ్జెక్టుకు సంబంధించి ఏలాంటి డౌట్స్ ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని, భయపడుతూ, సార్ ఏమంటారో, అని వెనకడుగు వేయకూడదని, ధైర్యంగా తెలపాలని జీవితంలో ఏ రంగం ఎంచుకున్న దృఢంగా నిలబడినాలని తెలిపారు.పదవ తరగతి అనేది జీవితానికి ఒక పునాది వంటిదని ఇక్కడ బాగా చదివి అందరూ ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులు కావాలని, మీకు మీ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

## సిద్దిపేట అభివృద్ధికి కృషి చేస్తా





**సిద్దిపేట రూరల్ ,జులై 16,(ప్రజాజ్యోతి):** ప్రజల ఆశీస్సులు, దైవ అనుగ్రహంతో సిద్దిపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ తెలిపారు.సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి స్వామి ఆలయం, శ్రీ త్రికూటేశ్వర స్వామి ఆలయాలను ఆయన గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు గరిపల్లి రాములు, గుర్రం అంజిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పుల్లూరు కనకయ్య గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఐరెని అంజిరెడ్డి, చిన్నకోడూరు మండల ఏఎంసీ వైస్‌చైర్మన్ బుస్స వంశీ, రూరల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిటుకుల అనిల్‌రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉడుత కుంటయ్య, యాదగిరి, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 19న సిద్దిపేటలో జగన్నాథ రథయాత్ర



**సిద్ధిపేట,జులై 16,(ప్రజాజ్యోతి):** హరే కృష్ణ సత్సంగం ఆధ్వర్యంలో ఈ నెల 19న సిద్దిపేటలో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ఆలయ ప్రతినిధి రంగతీర్థదాస్ తెలిపారు.గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పూరి జగన్నాథ స్వామి రథయాత్ర స్ఫూర్తితో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.సిద్దిపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని శ్రీనివాస ధ్యాన మందిరం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర గాంధీ చౌక్, సుభాష్ రోడ్, పాత బస్టాండ్, విక్టరీ టాకీస్ చౌరస్తా మీదుగా తిరిగి వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు కొనసాగుతుందని వివరించారు.రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం శ్రీనివాస ధ్యాన మందిరంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.విలేకరుల సమావేశంలో ఇస్కాన్ సభ్యులు బుచ్చిబాబు, మచ్చేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పరికరాల పంపిణీలో అక్రమాలపై విచారణ జరపాలి



**సిద్ధిపేట రూరల్ ,జులై 16,(ప్రజాజ్యోతి):** దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న స్కూటీలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, బిజినెస్ వెహికల్స్, బిజినెస్ ఆటోల పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల స్వేచ్ఛా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెమ్మసారం అశోక్ ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులను పక్కనబెట్టి అనర్హులకు పరికరాలు పంపిణీ చేసిన ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు, వికలాంగుల కార్పొరేషన్, సంబంధిత మంత్రులు ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన దివ్యాంగులకు న్యాయం జరగని పక్షంలో వారితో కలిసి సచివాలయం ముట్టడి చేపట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ముఖాముఖి చర్చకు సిద్ధమవుతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో దివ్యాంగులకు పంపిణీ చేసిన వాహనాలు, పరికరాల వివరాలను పరిశీలించి అర్హతల ఆధారంగా విచారణ జరపాలని ఆయన కోరారు. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ప్రయోజనాలు కల్పించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గొడుగు స్వరూప ఉపాధ్యక్షులు చామకూర సంజు, తెల్ల పద్మా రెడ్డి ప్రచార కార్యదర్శి మెట్ల నర్సయ్య, వెంకట్ రాజు, పరశురాములు, కీర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం

**- కిష్టంపేట సర్పంచ్ పంజాల జ్యోతి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**



**కొమురవెల్లి, జూలై 16 (ప్రజా జ్యోతి):-** మండలంలోని కిష్టంపేట గ్రామంలో మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామ దేవతలకు ప్రత్యేక జలాభిషేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పంజాల జ్యోతి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో చేపట్టారు. గామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ దేవతలను ప్రార్థించి, రైతులకు అనుకూలంగా వర్షాలు కురవాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మోహినీపుర శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



**సిద్ధిపేట రూరల్ ,జులై 16,(ప్రజాజ్యోతి):** సిద్దిపేట పట్టణంలోని మోహినీపుర వీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఏడాది మార్చి 16 నుంచి జూలై 16 వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం 9,53,135 రూపాయలు హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి. విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఏ. మారుతి, అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ నగేష్ విష్ణు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొని హుండీ లెక్కింపు ప్రక్రియను పూర్తి చేశారు.

## గ్రామదేవతలకు గంగాభిషేకాలు



**చిన్నకోదూరు, జూలై16, (ప్రజాజ్యోతి):-** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ చిన్నకోడూరు మండలంలోని మచాపూర్ గ్రామ రైతులు గ్రామదేవతలకు గురువారం గంగాభిషేకాలు నిర్వహించారు.కార్తెలు పోతున్నా చినుకు కూడా పడటం లేదని ప్రకృతి అనుగ్రహంతో కురిసే వర్షాలపైనే వ్యవసాయం ఆధారపడి ఉందని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కలు చెల్లించారు.

## ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం... రైతుల్లో ఆందోళన!

**విద్యుత్ శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి**



**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూలై 16:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారులో రహదారి పక్కన ఉన్న ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒక వైపుకు వంగిపోవడంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజూ వ్యవసాయ పనుల నిమిత్తం ఈ రహదారిపై రాకపోకలు సాగించే రైతులు, స్తంభం ఎప్పుడు కూలి పోతుందోనన్న భయంతో ప్రయాణి స్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో బలమైన గాలులు, భారీ వర్షాల కారణంగా స్తంభం కూలిపోయే ప్రమాదం మరింత పెరిగిందని వారు పేర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించేలోపే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి స్తంభాన్ని మరమ్మతు చేయాలని లేదా కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ఇలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాన్ని నివారించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శ్రీరామ మందిరం నిర్మాణం మనందరి బాధ్యత

- మండపం నిర్మాణానికి పి.అశోక్ సాయం మరువలేనిది
- దేవాలయ కమిటీ నిర్వాహకుల వెల్లడి



**తాండూరు జులై 16 ప్రజాజ్యోతి :** తాండూరు పట్టణం ఇంద్ర నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిర నిర్మాణంలో భాగంగా దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించా తలపెట్టిన మండపం నిర్మాణానికి స్థానిక భక్తుడు ప్రముఖ క్యాటరింగ్ వ్యాపారి పి. అశోక్ తన వంతుగా రూ 50 వేల ఆర్థిక సహాయం అందించి ఆదర్శంగా నిలిచారు. దేవాలయం ప్రాంగణంలో నూతనంగ నిర్మించే మండపం నిర్మాణం కోసం కావలసిన నిధులు సమకూర్చడంలో భాగంగా దేవాలయ కమిటీ సభ్యులు పలువురు భక్తులను కలిసి విన్నవిస్తున్నారు. అందులో భాగంగానే పిఅశోక్ రూ.50వేల రూపాయలు విరాళం అందజేశారని చెప్పారు. ఇందుకు గాను దేవాలయ కమిటి సభ్యులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండపం నిర్మాణం కోసం శ్రీరామ భక్తులు ఇంకా ఎవరైనా తోడ్పాటు అందించాలని ముందుకు వస్తే స్వాగతిస్తా మన్నారు.

## ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 641 రద్దు చేయాలి

- పార్టీ లకు అతీతంగా కలిసి పోరాడుదాం..
- డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతు తెలిపిన ఎంపీ డీకే అరుణమ్మకు ధన్యవాదాలు..
- డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ.
- ఎంపీ డీకే అరుణమ్మకు వినతిపత్రం అందజేత





**కొత్తూర్ జులై 16 (ప్రజా జ్యోతి) :** అందరి లక్ష్యం డంపింగ్ యార్డ్ రద్దని దాన్ని సాధించేందుకు పార్టీలకతీతంగా పోరాడుదామని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ అన్నారు.డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపేందుకు గురువారం ఆమె మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ఆమెకు డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతు తెలిపాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిద్ధాపూర్ చుట్టూ ఉన్న సుమారు 50 గ్రామాలకు డంపింగ్ యార్డ్ ఎఫెక్ట్ ఉంటుందని అన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు చిన్న సన్నకారు రైతులే ఉన్నారని పొట్ట కొట్టి వారి జీవితాలను రోడ్డున వేయొద్దని వేడుకున్నారు. మేమంతా ఒక తల్లి పిల్లలమని పార్టీ జెండా, ఎజెండా పక్కనపెట్టి పోరాడుదామని పిలుపునిచ్చారు.రైతు కాండువతో చలో సెక్రటేరియట్ గాని చలో కలెక్టరేట్ అని ఏ ఒక్కరు పిలుపునిచ్చిన లక్ష మందితో విజయవంతం చేయాలని అన్నారు.భార్యా పిల్లలను వదులుకొని పనిచేస్తున్నామని ప్రభుత్వం జీవో నెంబర్ 641 రద్దు చేయకపోతే చివరకు ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమవుతామని హెచ్చరించారు.డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతు తెలిపిన ఎంపీ డీకే అరుణమ్మకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్,బిజెపి పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వరల్డ్ మిఠాయి, నమ్కీన్ కన్వెన్షన్-26 ప్రారంభం



**హైదరాబాద్, జూలై 16 (ప్రజా జ్యోతి) :** జూలై 16–18 వరకు జరిగే వరల్డ్ మిఠాయి, నమ్కీన్ కన్వెన్షన్(డబ్ల్యూఎంఎన్సీ) పర్చేసింగ్–2026 గురువారం ఘనంగా ప్రారంభమైంది. రాజేష్ దాదూ(దాదూస్), పి.వి.వి.ఎస్. మల్లిఖార్జున రావు(సురుచి ఫుడ్స్), చైతన్య ముప్పాల(ఆల్మండ్ హౌస్), రాజేష్ రామ్నానీ(కరాచీ బేకరీ), ఫిరోజ్ హెచ్. నఖ్వీ(ఏఐఎం ఈవెంట్స్, ఎఫ్ఎస్ఎన్ఎం) జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ముడి పదార్థాలు, డ్రైఫ్రూట్స్, మెషినరీ, ప్యాకేజింగ్, ఆటోమేషన్ తదితర రంగాలకు చెందిన 300కుపైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. అనుముల బాబురావు, మహ్మద్ అబ్దుల్ మజీద్, నాగార్జున ముప్పాల, పూనంచంద్ పన్వార్, సుధీర్ షా పాల్గొన్నారు. హల్దీరామ్స్, పిస్తా హౌస్, అమూల్ మిఠాయి, అదానీ స్పైసెస్, బాలాజీ రతన్‌లాల్ మిఠాయి, వీకేసీ నట్స్, స్వాని ఎంటర్‌ప్రైజెస్, నివృతి ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్, పారస్ పాలిమర్స్, ప్రెస్టెయిర్ సిస్టమ్స్ ఎల్ఎల్పీ, కరాచీ బేకరీ, గిర్నార్ ఫుడ్ మెషిన్, విపిన్ అగర్వాల్–ది సాఫ్రాన్ ఎక్స్‌పర్ట్, మహేంద్ర మిఠాయివాలా, ఉపద్రష్ట డెయిరీ స్పెషాలిటీస్, రామ్ భరోసా సంస్థలు మద్దతు అందించాయి. జూలై 17న ఫన్నా బాబు మెమోరియల్ డబ్ల్యూఎంఎన్సీ క్రికెట్ లీగ్ ఫైనల్, జూలై 18న ఫ్యాక్టరీ విజిట్స్ నిర్వహించనున్నారు. 30 వేల మందికిపైగా వ్యాపార సందర్శకులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

### సహకార సంఘాల రుణాలతో రైతులకు భరోసా...

## రుణాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే టీఆర్ఆర్





**పరిగి, జూలై 16 (ప్రజాజ్యోతి) :** పరిగి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు సుమారు రూ.45 లక్షల 60 వేల విలువైన పిఏసిఎస్ గోల్డ్ లోన్ అలాగే ఎల్ టి రుణ చెక్కులను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ఐఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయ డ్రోన్ సేవలను ఎమ్మెల్యే టీఆర్ఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని, డ్రోన్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన సమయంలో సులభంగా రుణాలు అందించడం ద్వారా వారి వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా బలాన్నిచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు దుస్తులు ఇవ్వడం ఇష్టం లేని పంతులు

- నిర్మానుష ప్రాంతంలో సంచులలో నింపి పారవేసిన దృశ్యం - ప్రభుత్వ సంక్షేమానికి తూట్లు
- కూడుగుడ్డా అనే నినాదానికి తూట్లు పొడిచిన దుర్మార్గుడు
- తాండూరు బైపాస్ రోడ్డు మార్గంలో రెండు సంచులలో విద్యార్థుల ఏకరూప దుస్తులు దర్శనం







**తాండూరు జులై 16 ప్రజా జ్యోతి :** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఏటా రెండు జతల దుస్తులు ఇవ్వడం ఇష్టం లేని కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు (పంతుళ్ళు) ఓ నిర్మాణస్య ప్రాంతంలో సంచులకు సంచులే పారవేశారు. సరిగ్గా పరిశీలన చేస్తే వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు మార్గంలో పేద విద్యార్థుల దుస్తులు ఇక్కడ దర్శనమిస్తాయి. గురువారం రోజు కనిపించిన ఈ దృశ్యం పేద కుటుంబాల్లో కంటతడి పెడుతుంది. తినడానికి ఓ పూట భోజనం ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులు అందించడం కూడా చేతకాని ప్రభుత్వ ఉపాధ్యాయుడి దుర్మార్గపు స్థితిని ఎలా అంచనా వేయాలో అర్థం కావడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే దుస్తులను ఇవ్వడం కూడ ఇష్టం లేని కొందరు కావాలనే ఇలా నిర్మానుష్య ప్రాంతంలో సంచులలో నింపి ఉన్న మాదిరిగానే పారవేసిన దృశ్యం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ శివారు బైపాస్ రోడ్డు మార్గంలో కనిపించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. రెండు సంచులలో ఉన్న విద్యార్థుల ఏకరూప దుస్తులు సుమారు 100 మంది విద్యార్థులకు సరిపడా నీలి రంగు చెక్స్ షర్టులు, నేవీ బ్లూ ప్యాంట్లు,బాలికల గౌన్ లు అందులో కనిపించడం ఆశ్చర్యం కలిగించింది. గ్రామీణ పట్టణ పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే సంక్షేమానికి తూట్లు పొడిచే ఈ చర్యను స్థానికులు తీవ్రంగా ఖండించారు. కూడుగుడ్డా అనే నినాదానికి తూట్లు పొడిచిన ఈ దుర్మార్గుడిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.పేద పిల్లల చదువుకు అండగా ఉండాల్సిన వారే ఇలా నిర్లక్ష్యం చేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.తాండూరు బైపాస్ రోడ్డు వద్ద పారవేసి ఉన్న పేద విద్యార్థుల ఏకరూప యూనిఫామ్ దుస్తుల సంచులు. ఇలాంటి చర్యలపై విద్యాశాఖ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## గ్రామంలో ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలి







### దారుర్ పర్యటనలో కలెక్టర్ దీపక్ తివారీ దిశానిర్దేశం

**వికారాబాద్ ప్రతినిధి, జూలై 16(ప్రజా జ్యోతి) :** గ్రామాల్లో ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం వికారాబాద్ నియోజకవర్గం దారుర్ మండల కేంద్రంలో ఆయన ఆకస్మిక పర్యటన నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ, మహిళా సంఘం సమావేశం, ఇందిరమ్మ మహిళా శక్తి కుట్టు కేంద్రం, తరిగోపుల ప్రాథమిక పాఠశాల, ఆయిల్ ఫామ్ సాగు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికీ పంపిన ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా తిరిగి సేకరించే బాధ్యత బిఎల్ఓలదేనని స్పష్టం చేశారు. ఫారాల పూరణలో ప్రజలకు సహకరించడంతో పాటు తండాల ప్రజలకు అవగాహన కల్పించి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో లేని వారు ఆన్‌లైన్ ద్వారా ఫారాలు సమర్పించే విధంగా ప్రచారం చేయాలని తెలిపారు. మహిళా సంఘాల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించారు. రుణాలను సకాలంలో చెల్లించాలని, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ ఎఫ్ బి ఎస్)ను ప్రతి కుటుంబం ఉపయోగించుకునేలా డ్వాక్రా మహిళలు చైతన్యం తీసుకురావాలని అన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల యూనిఫాంలను సమయానికి పాఠశాలలకు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ వర్షాలు ఆలస్యమైతే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని, యూరియా, డిఏపి లభ్యతపై రైతులకు నిరంతరం సమాచారం అందించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. తరిగోపుల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల గణిత నైపుణ్యాన్ని అభినందిస్తూ నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. అనంతరం ఆయిల్ ఫామ్ సాగును పరిశీలించిన కలెక్టర్, ఈ పంటపై రైతుల్లో ఆసక్తి పెంచాలని, ప్రభుత్వ సబ్సిడీలు, అంతర పంటల లాభాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత, డిహెచ్ఎస్ఓ సత్తార్, జిల్లా వ్యవసాయ అధికారి కవిత, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీడీఓ నరసింహులు, ఎంఈఓ చెన్నయ్య, సర్పంచ్ పర్మిల తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అఖిలపక్ష ఐక్యగళం

- జీవో 641ను వెంటనే రద్దు చేయాలి
- మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ
- నిరాహార దీక్ష చేస్తున్న బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డికి ఎంపీ డీకే అరుణ నిమ్మరసం అందించి దీక్ష విరమణ



**కొత్తూర్ జులై 16 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్ధాపూర్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, రైతులు, యువకులు తరలివచ్చి డంపింగ్ యార్డు ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొని ఐక్యంగా పోరాటానికి మద్దతు ప్రకటించారు. సమావేశం అనంతరం డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ గత ఏడు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డికి ఎంపీ డీకే అరుణ నిమ్మరసం అందించి దీక్ష విరమింపజేశారు.ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.641ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని, ముందుగా ప్రజలను ఒప్పించి నిర్ణయం తీసుకుంటే అభ్యంతరం ఉండదన్నారు.హైదరాబాద్ నగరంలోని చెత్తను షాద్‌నగర్ ప్రాంతానికి తరలించడం ఏ మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా రాజకీయాలకు అతీతంగా జేఏసీ ఏర్పాటు చేసి పోరాటానికి సిద్ధమైన ప్రజలను అభినందించారు.సిద్ధాపూర్ ఒక్క గ్రామ సమస్య కాదని, పది కిలోమీటర్ల పరిధిలో సుమారు 50 గ్రామాల ప్రజలు కాలుష్య ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పార్టీల కంటే ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, పచ్చని వ్యవసాయ భూముల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ప్రాంతంలో ఇప్పటికే పరిశ్రమల కాలుష్యం అధికంగా ఉందని, రైతులు వ్యవసాయం, పాడిపంటలు, పాలు, పండ్లు, కూరగాయలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి డంపింగ్ యార్డు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి వద్ద సమయం తీసుకుని ప్రజాప్రతినిధులంతా కలిసి వినతిపత్రం అందజేయాలని సూచించారు. తాను కూడా ముఖ్యమంత్రికి లేఖ రాసి సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేస్తానన్నారు. అవసరమైతే ఇందిరా పార్క్ వద్ద ధర్నా, హైదరాబాద్ వరకు పాదయాత్ర వంటి ఉద్యమాల్లో స్వయంగా పాల్గొంటానని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి కూడా లేఖ రాసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సిద్ధాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు అధైర్యపడవద్దని, ఐక్యంగా పోరాడితే తప్పకుండా విజయం సాధిస్తామని ధైర్యం చెప్పారు. డంపింగ్ యార్డు ప్రతిపాదన పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మున్సిపల్ చైర్మన్





**కొడంగల్ జులై 16 ప్రజా జ్యోతి :** గురువారం కొడంగల్ మున్సిపాలిటీ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరుగుతున్నటువంటి పనులు మరియు అక్కడి సమస్యలుడసదుపాయాలు, విద్యార్థులకు ఇచ్చే ఆహార పదార్థాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించిన కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందరం ప్రశాంత్ గుప్త మరియు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తో కలిసి పరిశీలించారు అదేవిధంగా అక్కడ ఉన్న విద్యార్థులకు ఏ విధంగా ఇబ్బంది కలగకుండా అతితొందర్లోనే పనులు పూర్తి చేయాలని పనులు నిర్వహిస్తున్న వారికి తెలిపారు.

## గ్రామాలపై కరెంట్ బిల్లుల భారమా?

### కేంద్ర నిధులకు అడ్డుకట్టపై సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆగ్రహం



**వికారాబాద్ ప్రతినిధి, జూలై (ప్రజా జ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామపంచాయతీల కరెంట్ బిల్లులతో ముడిపెట్టడం సరైంది కాదని వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బి.రాములు ముదిరాజ్ తీవ్రంగా ఆక్షేపించారు. ఇప్పటికే అరకొర నిధులతో ఇబ్బందులు పడుతున్న గ్రామ సర్పంచులను రాష్ట్ర ప్రభుత్వం మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన విమర్శించారు. సర్పంచులు ఎన్నికై సుమారు ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయకపోవడం బాధాకరమని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం నుంచి వచ్చే నిధులపై కూడా పరిమితులు విధించడం సమంజసం కాదని అన్నారు.

గ్రామపంచాయతీ కరెంట్ బిల్లులు చెల్లించలేదని సర్పంచులపై చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు దిగడం, పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేయడం వంటి చర్యలతో ప్రభుత్వం భయాందోళనలకు గురిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. “అమ్మ పెట్టదు, అడుక్కునే అవకాశమూ ఇవ్వదు” అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి విధానాలను వెంటనే విరమించు కోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవస రమైతే అందరూ సంఘటితంగా పోరాటం చేసి తమ హక్కులను సాధించుకుంటామని రాములు ముదిరాజ్సంఫ్పుష్టం చేశారు.

## ఆగస్టు 29న ‘ఏథర్ కమ్యూనిటీ డే-2026’

ATHER

**హైదరాబాద్, జూలై 16 (ప్రజా జ్యోతి) :** ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తన ‘ఏథర్ కమ్యూనిటీ డే–2026’ కార్యక్రమాన్ని ఆగస్టు 29న బెంగళూరులో ‘ఎ న్యూ డాన్ ఆఫ్ మ్యాజిక్’ థీమ్‌తో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈఎల్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందించిన తొలి మాస్–మార్కెట్ స్కూటర్‌తో పాటు కొత్త సాంకేతికతలు, ఛార్జింగ్, వాహన యాజమాన్య సేవలకు సంబంధించిన ఆవిష్కరణలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రూ.1 లక్ష – 1.25 లక్షల ధర శ్రేణి వినియోగదారులను లక్ష్యంగా చేసుకున్న ఈ స్కూటర్ ఏథర్ మార్కెట్ విస్తరణలో కీలక మైలురాయిగా నిలవనుందని తెలిపారు. గత ఏడాది కమ్యూనిటీ డేలో ఈఎల్ ప్లాట్‌ఫామ్, రెడక్స్ కాన్సెప్ట్ వాహనం, తదుపరి తరం ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీ, ఏథర్‌స్టాక్ 7.0ను పరిచయం చేసినట్లు చెప్పారు.

## ఆకట్టుకున్న ‘శివోహం అమోఘం’ నృత్య ప్రదర్శన




**హైదరాబాద్, జూలై 16 (ప్రజా జ్యోతి) :** మహా శివుడిని కీర్తిస్తూ ‘శివోహం అమోఘం’ శీర్షికతో సుమారు 200 మంది నాట్య కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య రూపకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్పందన ఆర్ట్స్ నిర్వహించిన 35వ వార్షికోత్సవాలు రవీంద్రభారతిలో నృత్య, సంగీత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు కె.వి.రమణారావు మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ నృత్యాలు దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. దైవస్మరణకు సాహిత్యంతో పాటు నృత్యం, సంగీతం కూడా గొప్ప మాధ్యమాలని తెలిపారు. ‘శివోహం’ పేరిట కళాకారులు అందించిన నాట్య ప్రదర్శన నిజంగా అమోఘంగా ఉందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటేష్, న్యాయవాది బర్మా చక్రపాణి, బీజేపీ నాయకుడు నర్సింగ్‌రావు, నటుడు కోటేశ్, సాహితీవేత్త సత్యం తదితరులు పాల్గొన్నారు. స్పందన ఆర్ట్స్ సంస్థ స్థాపకులు శ్రీకాంత్ గౌడ్ వార్షిక నివేదికను సమర్పించారు. సంస్థ అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షత వహించగా, నృత్య దర్శకుడు రామ్‌దాసు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అడ్ల సతీష్‌కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# శ్వాస, ధ్యాస కరీంనగర్

## గల్లీగల్లీలో సీసీ రోడ్లు నిర్మిస్తాం: కేంద్ర మంత్రి బండి సంజయ్

## రూ.60 లక్షలు, రూ.49 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్ బ్యూరో,జూలై 16 (ప్రజాజ్యోతి): తన ధ్యాస, శ్వాస అంతా కరీంనగర్‌పైనే ఉందని, కేంద్రం నుంచి భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే



తన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకొని అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని తెలిపారు.కరీంనగర్ పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి 36వ డివిజన్ మారుతీనగర్‌లోని నైస్ ఇండియా బిల్డింగ్ సమీపంలో రూ.60 లక్షల (యూఐడీఎఫ్ రూ.50 లక్షలు, జనరల్ ఫండ్ రూ.10 లక్షలు) వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 27వ డివిజన్ శివాజీనగర్‌లో కరీంనగర్ డెయిరీ సమీపంలో రూ.49 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బండి సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లి అభినందనలు తెలియజేసి, సెల్ఫీలు దిగారు. అనంతరం ఆయన స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తోందన్నారు. స్మార్ట్ సిటీ, అమృత్-1, అమృత్-2, అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్, తాజాగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద భారీ నిధులు తీసుకొచ్చామని చెప్పారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మంజూరైన రూ.840 కోట్లతో కరీంనగర్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని తెలిపారు.ఈ నిధులతో మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, నాన్-మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు శివారు ప్రాంతాల గల్లీగల్లీలో సీసీ రోడ్లు నిర్మిస్తామని వెల్లడించారు. తెలంగాణలోనే కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద సుమారు రూ.900 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, అమృత్-1, 2 పథకాల కింద రూ.279 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లతో గల్లీల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేపట్టామని చెప్పారు. తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం రూ.156 కోట్లు మంజూరు చేసిందని, పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.తన ఏడేళ్ల ఎంపీ పదవీకాలంలో కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రూ.22 వేల కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చినట్లు బండి సంజయ్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి 12-బి హోదా, లా కళాశాల మంజూరు, ఎస్సారార్ కళాశాలకు అటానమస్ హోదా, అథ్లెటిక్స్ ట్రాక్, జమ్మికుంట స్టేడియం నిర్మాణానికి నిధులు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీఎస్ఆర్



నిధులతో ఆధునిక పరికరాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు గతంలో 20 వేల సైకిళ్లు పంపిణీ చేశామని, ఈ ఏడాది కూడా మరో 20 వేల సైకిళ్లను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. భవిష్యత్తులో కూడా కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## టీటీపీ రక్తవ్యాధికి సకాలంలో చికిత్సతోనే ప్రాణరక్షణ

### యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కరణం అశోక్ కుమార్

కరీంనగర్ టౌన్ జులై 16( ప్రజాజ్యోతి ): తగ్గని జ్వరం, వేగంగా పడిపోయే ప్లేట్‌లెట్లను సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్‌గా భావించి



నిర్లక్ష్యం చేయవద్దని యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ హెమటో ఆంకాలజీ, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ (బీఎంటీ) ఫిజీషియన్ డాక్టర్ కరణం అశోక్ కుమార్ సూచించారు. థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పురా (టీటీపీ) లాంటి ప్రాణాంతక రక్త సంబంధిత వ్యాధులను సకాలంలో గుర్తించి, వెంటనే థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్చేంజ్ (టీపీఈ) చికిత్స అందిస్తేనే రోగుల ప్రాణాలు కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు. గురువారం నగరంలోని యశోద హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీపీతో తీవ్ర అస్వస్థతకు గురైన 15 ఏళ్ల బాలికకు యశోద హాస్పిటల్స్‌లో విజయవంతంగా చికిత్స అందించినట్లు ఆయన వెల్లడించారు.

వేరే ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స పొందినా పరిస్థితి విషమించడంతో బాలికను ఇక్కడికి తరలించారన్నారు.

ప్రత్యేక పరీక్షలు చేసిన వైద్య బృందం ఆమెకు టీటీపీ ఉన్నట్లు నిర్ధారించిందని చెప్పారు. బాలికను అత్యవసరంగా ఐసీయూలో చేర్చి ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్ఎఫ్‌పీ), వెంటిలేటర్ సపోర్ట్‌తో పాటు థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్చేంజ్ చికిత్స అందించామని వివరించారు. కేవలం రెండు ప్లాస్మా ఎక్స్చేంజ్ సెషన్లతోనే ఆమె కోలుకుందని, ప్లేట్‌లెట్లు సాధారణ స్థాయికి చేరడంతో డిశ్చార్జ్ చేశామని వెల్లడించారు. అత్యాధునిక ఐసీయూ, హెమటాలజీ, బీఎంటీ విభాగాల సమన్వయంతో ఇలాంటి క్లిష్టమైన కేసులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని తెలిపారు. బీ-బ్లాక్ ఐదో అంతస్తులోని అత్యాధునిక బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ విభాగంలో రక్త సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ సమస్యలకు 24 గంటల పాటు నిపుణుల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం బాలిక తండ్రి లక్ష్మణ్ మాట్లాడుతూ హాస్టల్ నుండి ఇంటికి వచ్చిన తమ పాప స్వస్థ గురి కావడంతో జగిత్యాల్ కరీంనగర్ హాస్పిటల్ లో చూపించిన ఫలితం లేకపోవడంతో యశోద హాస్పిటల్ తరలించామని అక్కడ మెరుగైన వైద్యం అందించి తమ పాపను బతికించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్ సుధీర్ రెడ్డి, సీనియర్ ఎక్సక్యూటివ్ పొన్నాల రాజు పాల్గొన్నారు.

## భూసమస్యలకు చెక్.. రీ సర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

### తహసీల్దార్ నరేష్

కొడిమ్యాల, జూలై 16 (ప్రజాజ్యోతి): భూభారతి భూసర్వే-రీ సర్వే కార్యక్రమంలో భాగంగా కొడిమ్యాల మండలం తిప్పాయపల్లి గ్రామంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామపంచా





యతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తహసీల్దార్ నరేష్ మాట్లాడుతూ, రీ సర్వే ద్వారా భూముల హద్దులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, జియో కోఆర్డినేట్ల ఆధారంగా ఖచ్చితంగా నిర్ధారిస్తామని తెలిపారు. రైతుల వారీగా ఎల్‌పీఎం మ్యాపులు సిద్ధం చేయడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. భూముల రికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో హద్దుల వివాదాలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రైతులంతా సహకరించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ల్యాగల రాజేశం, మండల సర్వేయర్ తిరుపతి, గిర్దావర్ తిరుపతి, గ్రామ పాలనా అధికారి అలీం, పంచాయతీ కార్యదర్శి రవి, రైతులు పాల్గొన్నారు.

## నల్లగొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న బండి సంజయ్

కొడిమ్యాల, జూలై 16,(ప్రజాజ్యోతి): మండలం నల్లగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీక అని అన్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో భక్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానిక బీజేపీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారని,వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కిరణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు బండ నరసింహారెడ్డి, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## పలువురు బాధిత కుటుంబాలకు పరామర్శ

### మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

గంభీరావుపేట జూలై 15 (ప్రజా జ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం గత 20 రోజుల





క్రితం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు కోటా అనిల్, బంగ్లా అన్వేష్ గౌడ్ కార్ యాక్సిడెంట్ లో మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకొని కటక మృత్యుంజయ కోటలింగం మరియు బంగ్లా రమేష్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటారని భరోసా కల్పించారు. వీరి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్, బంగ్లా రాజు గౌడ్, అక్కపల్లి బాలయ్య, దేశెట్టి రాజశేఖర్, గోపగారి లక్ష్మీనారాయణ గౌడ్, గౌరీ శంకర్, టేకుమల్ల ప్రవీణ్,, దోసెల చంద్రం,నరేష్ వర్మ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో ఓటరు జాబితా సవరణ ఫారాల ఆన్‌లైన్ నమోదు వేగవంతం

ముస్తాబాద్, జూలై 16 ( ప్రజా జ్యోతి ): ముస్తాబాద్, జూలై 16: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ముస్తాబాద్ పట్టణ కేంద్రంలో ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. బి ఎల్ ఓ ల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, ఇప్పటివరకు సుమారు 60 శాతం నమోదు ప్రక్రియ పూర్తయింది. మిగిలిన దరఖాస్తులను కూడా త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన



ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఏద్దండి నరసింహ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కంచం మంజుల-నరసింహులు, వార్డు సభ్యులు శీలం వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు మిరుదొడ్డి శేరయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్

వేములవాడ,జులై,16:ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం 28 మంది లబ్ధిదారులకు 10 లక్షల 99 వేల విలువ



గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

## నేడు గంభీరావుపేట మండలంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటన

గంభీరావుపేట జూలై 16 (ప్రజా జ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం రోజున గంభీరావుపేట మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పొన్నాలపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొంటారని, బిజెపి మండల అధ్యక్షుడు కోడే రమేష్ తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



## రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ను సద్వినియోగం చేసుకోండి

- సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ
-కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు

గంభీరావుపేట జూలై 16 (ప్రజా జ్యోతి); అన్నీ ప్రైవేట్,ప్రభుత్వ హాస్పిటల్స్ లలో పెంచిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని



కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు అన్నారు, గురువారం గంభీరావుపేట మండలం శ్రీగాధ,రాజుపేట గ్రామాలలో నలుగురు లబ్ధిదారులు లత,శిరీష,ప్రకాష్,సుష్మ,లకు మంజూరైన సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులు మొత్తం రూ రెండు లక్షల ఇరవై నాలుగు వేల అయిదు వందల రూపాయలను కాంగ్రెస్ నాయకుల తో కలిసి పర్శ హన్మాండ్లు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారని మహిళలను వ్యాపారం లోకీ తీసుకువచ్చి ప్రోత్సహించి కోటీశ్వరులను చేస్తున్నారని అన్నారు,నవంబర్ నుండి కొత్త గా ఇందిరమ్మ ఇన్స్యూరెన్సు పథకం ప్రవేశపెడుతున్నారని దీనితో భూమి లేని రైతులకు కూడా 5 లక్షల బీమా అందుతున్నదన్నారు,మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు, ఈ కార్యక్రమంలో నాయకులు వేముల శ్రీనివాస్ గౌడ్,పర్శ శ్రీనివాస్,అల్లే రాజం,దిడ్డి నవీన్,పెద్ది లక్ష్మణ్,అల్లే రాజయ్య,దిడ్డి కిష్టయ్య,గౌరినేని భగవంత రావు,శ్రావణ్ రావు,నర్సింలు, బండి సత్యం,తొండ్ల నర్సింలు,స్వామి,శేఖర్,రమేష్ ,బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# యర్ర శ్రీనిధి పుట్టినరోజు వేడుకలు

★ కూతురు పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటిన కుటుంబం





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కుమార్తె యర్ర శ్రీనిధి పుట్టినరోజు సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం అర్బన్‌లోని ఎలుగుమట్ల అర్బన్ పార్క్‌లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనిధి తండ్రి యర్ర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం చేయటం వల్ల మా కుటుంబం ఎంతో సంతోషంగా ఉండటమే కాక ఎంతో ఆనందం అనిపించింది. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేస్తే చాలా బాగుంటుందని అన్నారు .పర్యావరణ కాపాడుకోవడం మన బాధ్యత, ప్రతి ఒక్క కుటుంబంలో ఏదో ఒక కార్యక్రమం జరుగుతుందని అలాంటి కార్యక్రమంలో భాగంగా ఇలాంటి మొక్కలు నాటే కార్యక్రమం చేస్తే బాగుంటుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ – 2843) జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నల్ల రాకేష్ రెడ్డి,లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస్,నగర ప్రధాన కార్యదర్శి మధు గౌడ్,టిబీజేఎ నగర అధ్యక్షుడు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, బుర్ర రాధాకృష్ణ,ఎస్.కె. సమీరా, ఫెడరేషన్ సభ్యులు, విలేకరులు, స్థానికులు పాల్గొని శ్రీనిధికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కుటుంబ సభ్యులను అభినందించారు.

# రుచి, పరిశుభ్రతలకు నిలయం "కార్తికేయ రెస్టారెంట్"

★ 12 రకాల కూరతో భోజనం.. ఆకుకూరల మా ప్రత్యేకత



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** నగర ప్రజలకు సరికొత్త రుచులను అందించడమే కార్తికేయ రెస్టారెంట్ ప్రత్యేకత నాణ్యతకు ప్రథమ ప్రాధాన్యత: ఈ భోజనశాలలో పరిశుభ్రతకు,రుచికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందరికీ అందుబాటులో ధరలతో సామాన్యుల నుండి అందరికీ అందుబాటులో ఉండేలా రీజనబుల్ ధరలతోనే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు. రవాణా సౌకర్యం: నగరంలోని ప్రధాన కేంద్రమైన కొత్త బస్టాండ్ ఎదురుగా ఉండటంతో ప్రయాణికులకు, స్థానికులకు ఇది ఎంతో అనువుగా మారింది. శాఖాహార ప్రియులకు వరం: ముఖ్యంగా వెజిటేరియన్ ప్రియుల కోసం కార్తికేయ రెస్టారెంట్ ప్రత్యేక మెనూను సిద్ధం చేసింది. 12 రకాల ఐటమ్స్: శాఖాహార భోజనంలో ఏకంగా 12 రకాల నోరూరించే వంటకాలతో కస్టమర్లకు అసలైన విందు భోజనాన్ని వడ్డిస్తున్నారు. ఆకుకూరల కూరలు మా ప్రత్యేకత: ఆరోగ్యాన్ని పెంపొందించే రకరకాల తాజా ఆకుకూరల కూరలు ఇక్కడి ప్రధాన ఆకర్షణ,ప్రత్యేకత అని యాజమాన్యం పేర్కొంది. ఆరోగ్యకరమైన వంటకాలు: వంటల్లో ఎలాంటి కృత్రిమ రంగులు, హానికరమైన రసాయనాలు వాడకుండా సహజ సిద్ధంగా తయారు చేస్తున్నారు. అనుభవజ్ఞులైన వంట మాస్టర్లు: ఎంతో అనుభవం ఉన్న వంట మాస్టర్ల ఆధ్వర్యంలో ఇక్కడ వంటకాలు రుచికరంగా సిద్ధమవుతున్నాయి. ఉత్తమ సిబ్బంది సేవలు: కస్టమర్ల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకునే సేవా సిబ్బంది ఇక్కడి మరో ప్రత్యేకత. ప్రశాంతమైన వాతావరణం: కుటుంబ సమేతంగా వచ్చి హాయిగా కూర్చుని భోజనం చేయడానికి అనువైన,ప్రశాంతమైన వాతావరణాన్ని ఇక్కడ కల్పించారు. తల్లి చేతి వంటల రుచి: ఇంట్లో వండుకునే భోజనం తరహాలోనే కమ్మని రుచితో, తృప్తికరమైన అనుభూతిని ఈ రెస్టారెంట్ అందిస్తోంది. ఆరోగ్య సూత్రాల పాటింపు: కిచెన్ విభాగంలో ప్రతి రోజూ కఠినమైన పరిశుభ్రత ప్రమాణాలను (హైజీన్) పాటిస్తున్నారు. ప్రయాణికులకు మంచి అవకాశం బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు సురక్షితమైన,రుచికరమైన భోజనం కోసం ఇకపై వెతుక్కోవాల్సిన పనిలేదు. విశాలమైన సిట్టింగ్ సదుపాయం: కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా విశాలమైన డైనింగ్ హాల్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. తాజా కూరగాయల వినియోగం: మార్కెట్ నుండి ప్రతిరోజూ సేకరించే తాజా కూరగాయలతోనే వంటకాలను సిద్ధం చేస్తారు. ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కార్తికేయ రెస్టారెంట్ తన అద్భుతమైన రుచులతో స్థానికుల మనసులు గెలుచుకుంటోంది. నాణ్యతలో రాజీ పడము: కస్టమర్లకు ఇచ్చే క్వాలిటీ మరియు క్వాంటిటీ విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఆహ్వానం: ఖమ్మం నగర ప్రజలు, ప్రయాణికులు ఒక్కసారైనా కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న తమ కార్తికేయ రెస్టారెంట్‌ను సందర్శించి కమ్మని భోజనాన్ని ఆస్వాదించాలని కోరుతున్నారు. కార్తికేయ భరోసా: రుచికి,పరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే తమ రెస్టారెంట్‌లో భోజనం చేసి,తృప్తిని పొందాలని యాజమాన్యం అందరినీ సాదరంగా ఆహ్వానిస్తోంది.

# జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం

★ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ★ మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ" ని అందజేసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యల ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి.రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మాచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మర్కోడులో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష

★ ఆన్‌లైన్ నమోదు సుమారు 900 పైన పూర్తి చేసినట్లు బీఎల్ఓ పాయం విజయ వెల్లడి



**ఆళ్ళపల్లి. జులై16(ప్రజాజ్యోతి)** ఆళ్ళపల్లి మండలం లోని మర్కోడు పంచాయతీ కేంద్రంలో బీఎల్ఓగా విధులు నిర్వహిస్తున్న పాయం విజయను మండల తహసీల్దార్ గడ్డం ఉమాదేవి, మర్కోడు గ్రామ సర్పంచ్ సుతారి రమాదేవి కలిసి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్ఓ పాయం విజయ మాట్లాడుతూ, తన పరిధిలో మొత్తం 1,300 మంది ఓటర్లకు సంబంధించి ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టగా, అందులో ఇప్పటికే సుమారు 900 మందికి పైగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారి నమోదు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఓటర్లందరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, అవసరమైన పత్రాలను అందించి నమోదు పూర్తి చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ కార్యక్రమంలో మర్కోడు సర్పంచ్ సుతారి రమాదేవి, బీఎల్ఓ పాయం విజయ, కాంగ్రెస్ నాయకులు కోనేటి వీరభద్రాచారి, ఎస్.కే. పర్వీన్, జీపీఓ రమణ, కొరం పద్మ, కొమరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయాల

# కట్టడికి విస్తృత తనిఖీలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని వివిధ దుకాణాలలో గంజాయిని చాక్లెట్లు, సిగరెట్, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు గురువారం కారేపల్లి, ఖమ్మం టౌన్, కూసుమంచి పోలీస్ స్టేషన్ల పరిధిలో కిరాణా దుకాణాలు, పాన్‌డబ్బాలలో తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయి హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు ముసుగులో జరుగుతున్న అక్రమ అమ్మకాలను పోలీసులు పసిగట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.



## రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన

# కానిస్టేబుల్‌ను అభినంధించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మూడు పతకాలు సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి రాజును పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. హైదరాబాద్‌లో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్ 2026లో పిల్లి రాజు, వుషూ స్వర్ణ పతకం రెజ్లింగ్ రజత పతకం,కెన్‌కెన్ సిలాట్ కాంస్య పతకాలు సాధించారు. అదేవిదంగా జూలై 12న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (ఖ+ఫీ)లో నిర్వహించిన కెజిఫ్ ఖశ్రీతీఘు గోల్డ్ రన్ 70కె ను 9గంటల 31నిముషాలు 31సెకండ్ ల లో విజయవంతంగా పూర్తి చేశారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

★ జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం



**కారేపల్లి, జూలై 16, ప్రజా జ్యోతి:** విద్యార్థులు పట్టుదలతో క్రమశిక్షణగా చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి అన్నారు. సింగరేణి మండలంలోని కేజీబీవీ ని గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి జి. సదానందం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ సూర్యగ్రహణం, చంద్రగ్రహణం వంటి దృగ్విషయాలు ఎలా ఏర్పడతాయి వంటి వివిధ నిత్య జీవిత సంఘటనల గురించి విద్యార్థులతో సంభాషించారు. నిరంతరం చదువు మీద శ్రద్ధ పెడుతూ, ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరాలని అన్నారు. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని అనవసరమైన అంశాలకు ప్రాధాన్యతనివ్వకుండా, బావి భవిష్యత్తుకు మంచి పునాది పాఠశాల దశలో వేసుకోవాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మధ్యాహ్న భోజన సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని ఏకరూప దుస్తుల కుట్టే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, వచ్చేవారం విద్యార్థినులకు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి బాజోజు ప్రవీణ్ కుమార్, పాఠశాల సిబ్బంది సమీనా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజెపి బీసీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

★ 20న రామవరం క్యాంపస్‌లో ఖాళీ సీట్ల భర్తీ ★ ఉచిత కార్పొరేట్ స్థాయి విద్య, వసతి

★ అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవీందర్ పిలుపు

**టేకులపల్లి, జూలై 16, ప్రజాజ్యోతి:** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో (ఎంపీసీ, బైపీసీ, సీఈసీ) 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి సంవత్సరం ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు టేకులపల్లి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రవీందర్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం క్యాంపస్‌లో మహాత్మా జ్యోతిబా పూలే కొత్తగూడెం, టేకులపల్లి జూనియర్ కళాశాలలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ఈ రెండు కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లు జూలై 20 (సోమవారం) ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామవరంలోని ఎం జె పి బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను సమర్పించాలని సూచించారు.

**తీసుకురావాల్సిన ధ్రువపత్రాలు**

టీసీ (ంజ)

ఎస్ఎస్‌సీ మార్కుల మెమో

స్టడీ సర్టిఫికేట్

ఆదాయ, కుల ధ్రువపత్రాలు

ఆధార్ కార్డు

బ్యాంక్ పాస్‌బుక్

మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు

ఏదైనా ధ్రువపత్రం అందుబాటులో లేకపోతే, సమర్పించేందుకు వారం రోజుల గడువు ఇస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

**కార్పొరేట్ స్థాయి ఉచిత వసతులు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపికైన విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తారు. రోజుకో గుడ్డు, నెలకు నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్ అందించడంతో పాటు ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, బెడ్ మెటీరియల్, ట్రంక్ బాక్స్, షూస్ సరఫరా చేస్తారు. అదనం గా నీట్,ఈఏపీసెట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణ, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీ సౌకర్యాలు కల్పిస్తారు. ఎస్‌జీఎఫ్, సీఎం కప్ వంటి క్రీడా పోటీలకు ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన బీసీ, ఇతర అర్హత గల విద్యార్థులు ఈసువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్. రవీందర్ విజ్ఞప్తి చేశారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

★ మండల వైద్యాధికారి భూక్యా సురేష్



**కారేపల్లి, జూలై16, ప్రజాజ్యోతి:** సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి భూక్యా సురేష్ అన్నారు. సింగరేణి మండలం ఎర్రబోడు గ్రామపంచాయతీ వడ్డెర గుంపులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరం, బిపి, షుగర్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇళ్లలో నీరు నిలవకుండా చూసుకోవాలని, అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్గా వచ్చే వ్యాధులైన జ్వరం, వాంతులు, విరోచనాలు వంటి వాటిని అశ్రద్ధ చేయకుండా, వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాణిక్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంఎల్ హెచ్ పి అరెం సంధ్య, ఏఎన్ఎం కల్పన, ఆశా వర్కర్ నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

★ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి (ఏఈఓ) అరుణ



**ఆళ్ళపల్లి. జూలై 16. (ప్రజాజ్యోతి)** ఆళ్లపల్లి మండలంలోని పాతూరు, జిన్నేలగూడెం, మర్కోడు గ్రామాల్లో ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని సూచించారు. వరి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోతే ప్రత్యామ్నాయంగా పెసర, మినుము, బొబ్బర వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) అరుణ రైతులకు వివరించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో మర్కోడు గ్రామ సర్పంచ్ సుతారి రమాదేవి పాల్గొని రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి శాస్త్రీయ విధానాలతో సాగు చేపట్టాలని కోరారు. రైతులు పంటల ఎంపిక, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.




# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

★ ప్రతి అర్హత కలిగిన ఓటరు ఫారాలు తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచన




**ఆళ్ళపల్లి. జూలై16(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి మండలంలోని ముత్తాపురం, అనంతోగు, రాయపాడు, ఆళ్లపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓలు) కలిసి కార్యక్రమం అమలు తీరుపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎస్ఐఆర్ ఫారాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఫారం నింపడంలో అవగాహన లేని ఓటర్లకు బీఎల్ఓలు ప్రత్యేకంగా సహకరించాలని సూచించారు. అలాగే ప్రతి ఓటరు ఫారాన్ని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోపు బీఎల్ఓలకు అందజేయాలని, లేకపోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పరిశీలనలో ఎస్ఐఆర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి, మాజీ గ్రంథాలయ చైర్మన్ దీండిగల రాజేందర్, ఉపసర్పంచులు నాగేష్, ఆరిఫ్, రఘుపతి గిరి, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, బీఆర్ఎస్ నాయకులు నరసింహారావు, బాబా వెంకటేశ్వర్లు, కిషోర్ బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## హరే కృష్ణ మూవ్ మెంట్ ఆధ్వర్యంలో 19న జగన్నాథ రథయాత్ర

శేరిలింగంపల్లి, జూలై 16 (ప్రజాజ్యోతి): హైదరాబాద్ హరే కృష్ణ మూవ్ మెంట్ కోకాపేటలో తొలిసారిగా నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర జులై 19 – 2026 ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గర్వంగా ప్రకటించారు. ఇది భారతదేశపు చిరకాల ఆధ్యాత్మిక సాంస్కృతిక వారసత్వాన్ని కొనియాడే పవిత్ర ఉత్సవం అందంగా అలంకరించిన శ్రీ జగన్నాథ బలదేవ సుభద్ర దేవత విగ్రహాలను ట్రైటిల్ గోల్డెన్ మైల్ లేఅవుట్ రోడ్డు కోకాపేట నుండి బయలుదేరి కోకాపేట వీధుల గుండా రాజ పుష్ప అట్రియ మీదుగా హరే కృష్ణ హెరిటేజ్






టవర్ నార్సింగ్ కోకాపేట వరకు ఒక అద్భుతమైన రథంపై యాత్ర సాగనుంది. వందలాది భక్తులు ఉత్సవంగా పాల్గొంటూ భక్తి సంగీతం తో పాటు భారీ ఎత్తున ప్రజల భాగ్యస్వామ్యంతో రథయాత్ర సాగనుంది. రథయాత్ర పోస్టర్ ను కార్యక్రమ వివరాలను విడుదల చేస్తూ సత్య గౌరచంద్ర దాస్ ప్రభుజి అందరినీ ఉత్సవంలో పాల్గొనాలని రథాన్ని లాగి జగనాథ బలదేవ సుభద్ర దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన ఆహ్వానించారు.అదేవిధంగా పద్మ పురాణంలో పేర్కొన్న విధంగా రథంపై భగవానుడిని దర్శించడం వల్లనే జనన మరణ చక్రం నుండి విముక్తి దిశగా ముందుకు సాగాలని ప్రబుజీ తెలిపారు. ఈ చారిత్రక సందర్భంలో భక్తులు, కుటుంబాలు, శ్రేయోభి లాషులు, అందరూ ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్ హరే కృష్ణ మూవ్ మెంట్ అధ్యక్షులు అక్షయపాత్ర రీజినల్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభుజి అధ్యక్షతన జరిగే ఈ రథయాత్ర కార్యక్రమా నికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రి గేషన్ సభ్యులు యువత శ్రేయోభిలా షులు హాజరవుతారని ఆయన తెలిపారు.

## గ్రామాలపై కరెంట్ బిల్లుల భారమా?

### – కేంద్ర నిధులకు అడ్డుకట్టపై సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆగ్రహం

వికారాబాద్ ప్రతినిధి, జూలై( ప్రజా జ్యోతి): కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామపంచాయతీల కరెంట్ బిల్లులతో ముడిపెట్టడం సరైంది కాదని వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బి. రాములు ముదిరాజ్ తీవ్రంగా ఆక్షేపించారు. ఇప్పటికే అరకొర నిధులతో ఇబ్బందులు పడుతున్న గ్రామ సర్పంచులను రాష్ట్ర ప్రభుత్వం మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన విమర్శించారు. సర్పంచులు ఎన్నికై సుమారు ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి



నిధులు కూడా విడుదల చేయకపోవడం బాధాకరమని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం నుంచి వచ్చే నిధులపై కూడా పరిమితులు విధించడం సమంజసం కాదని అన్నారు. గ్రామపంచా యతీ కరెంట్ బిల్లులు చెల్లించలేదని సర్పంచులపై చర్యలు తీసుకుం టామని బెదిరింపులకు దిగడం, పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేయడం వంటి చర్యలతో ప్రభుత్వం భయాందోళన లకు గురిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. "అమ్మ పెట్టదు, అడుక్కునే అవకాశమూ ఇవ్వదు" అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి విధానాలను వెంటనే విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైతే అందరూ సంఘటితంగా పోరాటం చేసి తమ హక్కులను సాధించుకుంటామని రాములు ముదిరాజ్సంఘ్పష్టం చేశారు.

## యూకెతో ఆర్థిక ఒప్పందంతో అధిక ప్రయోజన్

హైదరాబాద్,జూలై16(ప్రజాజ్యోతి): భారత్– యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. రెండు దేశాల మధ్య రూ. 32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమికండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ. 3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉ ందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, డసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్సుడ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 350 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చెప్పారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం

### అట్రాసిటీ కేసుల పరిష్కారం లో జాప్యం వద్దు
### అధికారులకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 16, (ప్రజా జ్యోతి): ఎస్సీ ఎస్టీ ల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత



ఇవ్వా లని, అట్రాసిటీ కేసుల పరి ష్కారంలో ఏ మాత్రం జా ప్యం చేయవద్దని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభు త్వం అమలు చేస్తున్న పథ కాలు ప్రతి అర్హుడికి క్షేత్రస్థా యిలో అందేలా అన్ని శాఖ ల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని రా ష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చై ర్మన్ బక్కి వెంకటయ్య ఆదే శించారు. ఎస్సీ, ఎస్టీలపై న మోదైన అట్రాసిటీ కేసుల ద ర్యాప్తు, విచారణలో ఎలాం టి జాప్యానికి తావివ్వకుం డా పెండింగ్ కేసులను ప్రత్యే క దృష్టితో త్వరిత గతిన పరి ష్కరించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో జిల్లా కలెక్ట ర్ రాజర్షి షా అధ్యక్షతన ని ర్వహించిన ఉన్నతస్థాయి స మీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పూల మొక్కలతో కమిషన్ చైర్మన్, సభ్యులకు జిల్లా కలె క్టర్, ఎస్పీ, అధికారులు స్వా గతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీ కరించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమ లు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రిజర్వేషన్ అ మలు, సబ్‌ప్లాన్ నిధుల వి నియోగం తదితర అంశాల పై శాఖల వారీగా సమీక్ష ని ర్వహించారు.సమీక్ష సంద ర్భంగా జిల్లాలో అమలవు తున్న సంక్షేమ పథకాల పు రోగతి, అట్రాసిటీ కేసుల న మోదు, దర్యాప్తు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరి హారం చెల్లింపు, ప్రభుత్వ వి ద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న సదుపాయా లు, అంబేద్కర్ ఓవర్సీస్ వి ద్యా పథకం, కులాంతర వి వాహాల ప్రోత్సాహకాలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం అమలుపై చ ర్చించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, జిల్లా లో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షే మం, అభివృద్ధి, రాజ్యాంగ బద్ధ హక్కుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వా లని స్పష్టం చేశారు. ప్రభు త్వ పథకాల ప్రయోజనాలు ముఖ్యంగా మారుమూల గ్రా మాలు, గిరిజన ప్రాంతాల్లో ని అర్హులందరికీ చేరేలా అధి కారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్య లు తెలుసుకుని అక్కడి క క్కడే పరిష్కరించే విధంగా సేవలు అందించాలని పేర్కొ న్నారు.అట్రాసిటీ కేసుల్లో బా ధితులకు చట్టప్రకారం అం దాల్సిన పరిహారం, పునరా వాసం, ఇతర సౌకర్యాలు స కాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి త్వరితగ తిన పరిష్కరించాలని సూ చించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యో గుల పదోన్నతులు, సర్వీస్ అంశాల్లో ప్రభుత్వ నిబంధన లను ఖచ్చితంగా అమలు చేయాలని, రోస్టర్ విధానా న్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్ర తి నెల చివరి వారంలో ని



ర్వహించే సివిల్ రైట్స్ డే స మావేశాలను తప్పనిసరిగా నిర్వహించి, ప్రజల ఫిర్యాదు లను నిర్ణీత గడువులోగా ప రిష్కరించాలని సూచించా రు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కం గా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాసంస్థలను జిల్లా అధికారులు తరచూ తనిఖీ చేయాలని, విద్యార్థు లకు నాణ్యమైన విద్య, పౌ ష్టికాహారం, వసతి, పారిశు ధ్యం, భద్రత, వైద్య సేవలు అందుతున్నాయో నిరంత రం పరిశీలించాలని ఆదేశిం చారు. లోపాలు గుర్తిస్తే వెం టనే సరిది ద్దాలని సూచించా రు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ని ధులను ఆయా వర్గాల అవ సరాలున్న ప్రాంతాల్లోనే విని యోగించాలని, మంజూరైన గ్రామ పంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ), అంగన్ వాడీ భవనాల నిర్మాణాల ను వేగంగా పూర్తి చేయాల ని పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సంబంధించిన నిధులు ఎక్కడైనా పెండింగ్ లో ఉంటే ముఖ్యమంత్రి దృ ష్టికి తీసుకెళ్లి విడుదలయ్యే లా కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. జిల్లా కలె క్టర్ రాజర్షి షా మాట్లాడు తూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమర్థ వంతంగా అమల వుతున్నా యని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కామన్ మె నూ అమలు, ఉపకార వేత నాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కూలీలకు అధిక పని దినాలు కల్పించేందుకు చ ర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగంగా కొనసాగు తోందని వెల్లడించారు. కమి షన్ సభ్యులు మాట్లాడు తూ క్షేత్రస్థాయిలో ప్రతి ఎ స్సీ, ఎస్టీ కుటుంబానికి ప్రభు త్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు మరిం త చొరవ చూపాలని సూ చించారు. మున్సిపాలి టీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారి శుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూ చించారు. అనంతరం కమి షన్ చైర్మన్, సభ్యులను జి ల్లా కలెక్టర్ శాలువాలతో స త్కరించారు. ఈ సమావే శంలో కమిషన్ సభ్యులు కు స్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారా యణ, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో మంద మకరందు, ఏఎస్పీ సాయి రుత్విక్ కొట్టే, అదన పు కలెక్టర్లు ఆర్.ఎస్. చి త్రూ, రాజేశ్వర్, డీఆర్ఓ స్ర వంతి, ఆదిలాబాద్, ఉట్నూ ర్ ఆర్డీఓలు జగదీశ్వర్ రావ్, మోహన్ సింగ్, డీఎస్పీ జీవ న్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధు లు, తదితరులు పాల్గొన్నా రు.

## గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

మొదటిపేజీ తరువాయి..

దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్ఠంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉ ప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా



సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉ మ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ–డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ–డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్టను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉ మ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉ ద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం

మొదటిపేజీ తరువాయి..


శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో సీబీఐ పలు కీలక ఆధారాలను ప్రస్తావించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన శివరాజ్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔ÷ం) ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడైన పీవీ కులకర్ణి నుంచి నీట్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. కులకర్ణి నిర్వహించిన కోచింగ్ తరగతులకు శివరాజ్ కుమారుడు హాజరయ్యాడని పేర్కొంది. కేసు దర్యాప్తులో భాగంగా శివరాజ్ ఫోన్‌ను పరిశీలించగా.. అందులో 36 ఫొటోలు లభించినట్లు సీబీఐ తెలిపింది. వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉండగా.. అందులో 111 ప్రశ్నలు నీట్ యూజీ 2026 మాస్టర్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలినట్లు వెల్లడించింది. రసాయన శాస్త్ర ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ నిందితుడు రాసినవేనని తాము భావిస్తున్నట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. మే 3న జరిగిన నీట్ పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు ఈ ఫొటోలు తీసినట్లుగా దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేయగా.. వారందరూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు సీబీఐ తెలిపింది. పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్–యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో నీట్–ప్రశ్నపత్రం లీక్ కేసులో సీబీఐ ఢిల్లీ కోర్టుకు కీలక వివరాలు వెల్లడించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ మోటెగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో 136 చేతిరాత ప్రశ్నల్లో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన క్వశ్చన్ పేపర్ సెట్‌తో సరిపోలినట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది.

లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్ నిర్వహిస్తున్న శివరాజ్ మోటెగావ్‌కర్, 'మోటెగావ్‌కర్ సరస్ ఆర్‌సీసీ' పేరుతో సుమారు 1.68 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్న యూట్యూబ్ ఛానెల్‌ను కూడా నిర్వహిస్తున్నాడు. అతను ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను సీబీఐ పరిశీలించగా, అందులో కెమిస్ట్రీకి సంబంధించిన 132 చేతిరాత ప్రశ్నలు ఉన్న 36 ఫొటోలు లభించాయి. వాటిలో ఐదు ఫొటోలు ఒకే విధంగా ఉండగా, మిగిలిన ఫొటోల్లో ఉన్న చేతిరాత ప్రశ్నలు శివరాజ్ మోటెగావ్‌కర్ రాసినవేనని సీబీఐ భావిస్తోంది. సీబీఐ దర్యాప్తు ప్రకారం.. మే 3న జరిగిన నీట్–యూజీ 2026 పరీక్షకు దాదాపు 10 రోజుల ముందే, అంటే ఏప్రిల్ 23న శివరాజ్ మోటెగావ్‌కర్‌కు లీకైన ప్రశ్నలు అందినట్లు తెలుస్తోంది. లాతూర్‌కు చెందిన డాక్టర్ మనోజ్ శిరూరే, మాజీ ఎన్‌టీఏ ప్యానెల్ సభ్యుడు, రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణి ద్వారా ఈ ప్రశ్నలు మోటెగావ్‌కర్‌కు చేరినట్లు సీబీఐ తెలిపింది. ఇందుకోసం రూ.5 లక్షలు చెల్లించినట్లు కూడా ఆరోపించింది. ఈ కేసులో ఇప్పటికే మోటెగావ్‌కర్‌ను అరెస్టు చేసిన సీబీఐ, అతని బెయిల్‌ను వ్యతిరేకిస్తూ ఢిల్లీ కోర్టుకు సమర్పించిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. అలాగే, లీకైన ప్రశ్నపత్రం పీడీఎఫ్ కాపీలను టెలిగ్రామ్ ద్వారా రూ.10 లక్షలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్షకు కొన్ని వారాల ముందే 410 ప్రశ్నలతో కూడిన 150 పేజీల 'అంచనా ప్రశ్నపత్రం'ను కొంతమంది అభ్యర్థులకు అందించినట్లు సీబీఐ తెలిపింది. అందులోని సుమారు 120 ప్రశ్నలు నీట్–యూజీ 2026 కెమిస్ట్రీ ప్రశ్నపత్రంలో వచ్చిన ప్రశ్నలతో సరిపోలినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో పరీక్షకు ముందే ప్రశ్నపత్రంలోని కీలక ప్రశ్నలు కొందరి చేతికి చేరినట్లు సీబీఐ దర్యాప్తులో గుర్తించింది.

## 500 మంది జలసమాధి

మొదటిపేజీ తరువాయి..

ఐక్యరాజ్యసమితి గురువారం ప్రకటించింది. మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలకు ప్రయాణిస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగినట్టు తెలిపింది. ఇటీవలి కాలంలో జరిగిన అత్యంత ఘోరమైన పడవ ప్రమాదాల్లో ఇది ఒకటని ఐరాస పేర్కొంది. భారీ ప్రాణనష్టం పట్ల అంతర్జాతీయ వలసదారుల సంస్థ (ఐఓఎం), ఐక్యరాజ్యసమితి శరణార్థుల హై కమిషనర్ (యూఎన్‌హెచ్‌సీఆర్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. జులై మొదటి వారంలో జరిగిన ఈ ఘటనలో బాధితుల గురించి కచ్చితమైన వివరాలు అందుబాటులో లేవని ఐరాస వివరించింది.రుతుపవన వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపింది. ప్రాథమిక నివేదికల ప్రకారం.. శరణార్థులతో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి జూన్ చివరి వారం ఈ పడవలు బయలుదేరాయి. ఇందులోని ప్రయాణికులు బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలకు చెందినవారని భావిస్తున్నారు. దాదాపు 250 మందితో వెళ్తున్న పడవల్లో ఒకటి.. తీరం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే సంబంధాలు కోల్పోయింది. అలాగే, జులై 8న మయన్మార్ అయేయార్వాడి నది తీరంలో 280 మందితో ప్రయాణిస్తున్న మరో పడవ బోల్తా పడినట్లు సమాచారం. రుతుపవనాలు, తుఫాన్ల కారణంగా బంగాళాఖాతంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో రోహింగ్యాలు అరుదుగా ప్రయాణిస్తుంటారు. ఇలాంటి సమయంలో ఈ ఘోరమైన విపత్తు సంభవించింది. రుతుపవనాల కారణంగా ఆ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు, విస్తృతమైన వరదలతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారి ఉండొచ్చని ఐక్యరాజ్యసమితి సంస్థలు పేర్కొన్నాయి. మయన్మార్ రఖైనా రాష్ట్రంలో తీవ్ర హింస, పేదరికం నుంచి తప్పించుకునే ప్రయత్నాల్లో భాగంగా రోహింగ్యా శరణార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సైనిక అణచివేతతో ఆ దేశం నుంచి పారిపోయి వచ్చిన సుమారు 12 లక్షల మంది బంగ్లాదేశ్‌లోని కిక్కిరిసిన శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. మయన్మార్‌లో ఉన్నవారు తీవ్రమైన ఆంక్షలతో నిర్బంధ శిబిరాల్లోనే జీవించాల్సిన పరిస్థితులు నెలకున్నారు. బంగాళాఖాతం , అండమాన్ సముద్రంలోని ఈ మార్గం ఇటీవలి సంవత్సరాలలో చిన్నారులు, గర్భిణీలు సహా వేలాది మంది రోహింగ్యాల ప్రాణాలను బలితీసుకుంది. ఐరాస శరణార్థుల సంస్థ ప్రకారం.. గతేడాది ఈ ప్రమాదకర ప్రయాణానికి ప్రయత్నించిన 6,500 మందికి పైగా రోహింగ్యాల్లో దాదాపు 900 మంది మరణించారు లేదా గల్లంతయ్యారు. ఇలాంటి ప్రయాణాల చరిత్రలో ఇదే అత్యంత ఘోరమైన ఏడాది. ప్రపంచం ప్రధాన శరణార్థుల సముద్రయానాల్లో ఈ మార్గంలోనే ప్రస్తుతం అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని యూఎన్‌హెచ్‌ఆర్సీ ఆందోళన వ్యక్తం చేసింది.



Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967